నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 25-3-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 204 | పేజీలు: 4 | వెల: రూ.1/-

పేపర్లను పంపిణీ చేయబోమన్న హాకర్స్

హైదరాబాద్,మార్చి24(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు హైదరాబాద్, మల్కాజిగిరి హాకర్స్ అసోసియేషన్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ నెల 31వ తేదీ వరకూ అన్ని దినపత్రికల పంపిణీని నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. కరోనా నివారణ చర్యల్లో భాగంగా, రేపటి నుంచి ఈ నిర్ణయాన్ని అమలు చేస్తున్నామని, తమ ప్రాంతంలోకి పత్రికల ఏజెంట్లకు పేపర్ సరఫరాను నిలిపివేయాలని కోరింది.

ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు, ఏజంట్లకు వినతిపత్రాన్ని అందించారు. కాగా, ఇప్పటికే కొన్ని ఆంగ్ల దినపత్రికలు నెలాఖరు వరకూ షట్ డౌన్ ను ప్రకటించాయి. మరికొన్ని పత్రికలు మాత్రం యథావిధిగా నడుస్తున్నాయి. మల్కాజిగిరి హాకర్లు తీసుకున్న నిర్ణయాన్నే మరికొన్ని ప్రాంతాల హాకర్లు సైతం తీసుకునేందుకు చర్చిస్తున్నారని సమాచారం.

ఉగాది ఉత్సాహాన్ని కబళించిన కరోనా

ఈ యేడు పరిమితంగానే ఇళ్లల్లో వేడుకలు

పంచాంగ శ్రవణాలకూ అడ్డుచక్రం

హైదరాబాద్,మార్చి24(ఆర్ఎన్ఎ): భారతీయ పండగల పరమార్థమే వేరు. కాలమానం ప్రకారం, ప్రకృతికి దగ్గరగా పండగల పరమార్థం ఉంటుంది. అంతేగాకుండా ప్రతి పండగ వెనకా ఓ సామాజిక చైతన్యం కూడా కనిపిస్తుంది. ఉగాది పండగ ఉత్సాహ, ఉల్లాసభరిత వాతావరణంలో జరుపుకునే చేదుతీపిల కలయిక. కొత్తచిగుర్లు వేస్తున్న తరుణమిది. వసంతాన్ని స్వాగతిస్తూ సర్వత్రా ఆనందమయ సుఖజీవనాన్ని కలిసి కట్టుగా గడపాలన్నది ఉగాది లక్ష్యం. ఉగాది వసంత ఆగమనానికి, కొత్త జీవితాలకు సంకేతంగా ఉంది. కొత్త సంవత్సరం కొత్తగా ఆరంభించాలనుకున్న వారికి ఈ యేడు చేదు అనుభవాలను మిగిల్చింది. ఈ యేడు ఎక్కడా ఉగాది సందడి కానరావడం లేదు. కరోనా ఎఫెక్ట్ కారణంగా ప్రజలు ఇంటికే పరిమితం కావడమే గాకుండా పరిమితంగా శార్వరి ఉగాది సంబరాలు చేసుకోవాల్సి వస్తోంది. మానవ జీవనానికి, కాలానికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకునే ఆనందవేళ ఉగాది. కాలాన్ని గుణిస్తూ, మార్పులకు అనుగుణంగా జీవితాన్ని తీర్చిదిదుకోవాలనే సందేశాన్ని ఇది అందిస్తుంది. యుగానికి ఆరంభమే ఉగాదిగా మారిందన్నది పండితాభి ప్రాయం. మిగిలిన పండగలకన్నా ఉగాది ఎంతో ప్రత్యేకమైంది. సాధారణంగా పర్వదినాలన్నీ ఏదో ఒక దేవత లేదా దేవుడి పూజలకి సంబంధించి ఉంటాయి. ఉగాది ఇందుకు పూర్తి భిన్నంగాఉంటుంది. ఏ దేవుడి పేరూ ఈ రోజు ప్రత్యేకంగా వినిపించదు. నవనానికి, వ్యక్తిత్వ వికాసానికి, మనోవికాసానికి ఆలవాలంగా నిలుస్తుంది. ఎల్లప్పుడూ మంగళధ్వనులు వినాలనే తపనకు ప్రతిరూపమే కోకిల కూత. ఈవిధంగా ఉగాది మనిషి జీవనంలో కీలకంగా, మూలకంగా ఆవిర్భవించింది. అంతేకాదు ఈ పర్వదినం పునరుజ్జీవనానికి సంకేతం. అప్పటివరకు మోడుబారిన చెట్లు, తీగెలు ఉగాది రాకతో మళ్లీ చిగురించి పూలు, కాయలతో కళకళలాడినట్లు కష్టనష్టాలతో కుంగిపోతున్న మనిషి జీవితం ధైర్యంతో, ఆశతో ముందుకుసాగాలనే సందేశాన్ని అందిస్తుంది. సంవత్సరం తొలిరోజున ప్రతివ్యక్తీ శుభమే కలగాలని కోరుకుంటూ నిష్కల్మష హృదయంతో, ఆనంద పరవశ భావంతో ఉండటం సహజం. అలాంటి సంతోషవేళ తీసుకునే నిర్ణయం కూడా మంచి నిర్ణయమే అవుతుంది. గతమేదో జరిగిపోయింది, ఇకనైనా అందరం కలిసి ఉండాలి అనే భావన ఏర్పడుతుంది. షడ్రుచులు, పంచాంగ శ్రవణం, తీపివంటకాలు ఇవన్నీ కూడా మన బాధలను మరచి జీవితాన్ని కొత్తగా ఆరంభించడానికి కొత్తగా ఆలోచించడానికి దోహదపడే చర్యలుగా గుర్తించాలి. ఈ సద్భావన ఉద్భవానికి పంచాంగ శ్రవణం దోహదం చేస్తుంది. కొత్త సంవత్సరం అంటే మనమంతా ఇక కొత్తగా ముందుకు సాగాలని అనుకోవడం. 'ఉగాది' అన్న పదం యుగ ఆది నుంచి వచ్చింది. అంటే యుగం ప్రారంభమయ్యే రోజని అర్థం. పురాణాల ప్రకారం చూస్తే బ్రహ్మదేవుడు ఇదే రోజున విశ్వాన్ని సృష్టించాడని నమ్ముతారు. బ్రహ్మదేవుడు సృష్టిని ప్రారంభించిన యుగాదే తరవాత ఉగాదిగా మారిందని పెద్దల మాట. ఉగాది నుంచే వసంతోత్సవాలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. అంతేగాక ప్రకృతికి సంబంధం కూడా దాగి ఉంటుంది. మన సంప్రదాయం, పండగల వెనుక పరమార్థం తప్పకుండా ఉంటుంది. మనజీవితం కష్టసుఖాలమయం. మార్పు కోరుకునే సందర్భంలో అంతా కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని కోరుకోవడం సహజం. ఉగాది అనగానే ముందుగా స్ఫురణకు వచ్చేది పంచాంగ శ్రవణం. పండగ రోజు సాయంత్రం దేవాలయాల్లో జరిగే పురాణ శ్రవణం వినడం వల్ల కూడా సామాజిక సమభావన స్ఫూర్తి కలుగుతుంది. అయితే ఈ యేడు కరోనా కారణంగా ఎక్కడా పంచాంగ శ్రవణాలు లేవు. ప్రభుత్వం నిర్వహించే పంచాంగ శ్రవణం కూడా రద్దయ్యింది. సంవత్సరం అంతా ఎలా ఉంటుంది? గోచారఫలాలు ఎలా ఉన్నాయి. రోజువారీ, నెలవారీగా పర్వదినాలు, ఉత్సవాలు, గ్రహణాలు... ఎప్పుడెప్పుడు వస్తాయి? ఏయే సమయాల్లో ఏ కార్యక్రమాలను నిర్వహించాలి? వంటి మంచి చెడులను పంచాంగ శ్రవణం ద్వారా తెలుసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ యేడు అలాంటి అవకాశాలు లేకుండా పోయాయి.

రాజ్యసభ ఎన్నికలు వాయిదా

కరోనా నేపథ్యంలో ఎన్నికల సంఘం నిర్ణయం

న్యూఢిల్లీ,మార్చి24(ఆర్ఎన్ఎ): ఈ నెల 26న జరగాల్సిన రాజ్యసభ ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎన్నికలను ఎప్పుడు నిర్వహిస్తామనేది.. మార్చి 31 తర్వాత వెల్లడిస్తామని ఎన్నికల సంఘం వెల్లడించింది. కరోనా వైరస్ నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో.. ఎన్నికల సంఘం కూడా అప్రమత్తమైంది. జన సమూహం లేకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్న క్రమంలో రాజ్యసభ ఎన్నికలను వాయిదా వేసినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ప్రజారోగ్యం దృష్ట్యానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఎన్నికల్లో భాగంగా ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల ఏజెంట్లు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొనాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో జన సమూహం అధికంగా ఉంటుంది. ఆ సమూహంలో ఏ ఒక్కరికి వైరస్ ఉన్నా.. అది వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది కనుక ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. 17 రాష్ట్రాల్లో 55 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు మార్చి 26న ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే కొన్ని రాష్ట్రాల్లో ఏకగ్రీవాలు అయ్యాయి. దీంతో గుజరాత్, మధ్యప్రదేశ్,ఆంధ్రప్రదేశ్‌లో 18 స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇప్పుడున్న ప్రక్రియ అలాగే ఉంచుతూ ఎన్నికల తేదీని మాత్రం తదుపరి ప్రకటిస్తారు.

తెలంగాణలో మరో మూడు పాజిటివ్ కేసులు

సౌదీ,లండన్,జర్మన్ నుంచి వచ్చిన వారికి పాజిటివ్

36కు చేరుకున్న కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య

హైదరాబాద్,మార్చి24(ఆర్ఎన్ఎ): తెలంగాణలో కరోనా వైరస్ పాజిటివ్ కేసులు 36కు చేరాయి. మంగళవారం మూడు పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. లండన్ నుంచి వచ్చిన కోకాపేట వాసికి కరోనా సోకింది. జర్మనీ నుంచి వచ్చిన చందానగర్ మహిళకు, సౌదీ అరేబియా నుంచి వచ్చిన బేగంపేట మహిళకు(60) కరోనా వైరస్ సోకినట్లు అధికారులు గుర్తించారు. తెలంగాణ వైద్య, ఆరోగ్యశాఖ మంగళవారం విడుదల చేసిన హెల్త్ బులిటెన్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. లండన్ నుంచి వచ్చిన రంగారెడ్డి జిల్లా కోకాపేటకు చెందిన 49 ఏళ్ల వ్యక్తికి, జర్మనీ నుంచి వచ్చిన చందానగర్‌కు చెందిన 39 ఏళ్ల వివాహితకు, సౌదీ అరేబియా నుంచి వచ్చిన బేగంపేటకు చెందిన 61 ఏళ్ల మహిళకు కరోనా సోకినట్టుగా తెలిపింది. దీంతో తెలంగాణలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 36కు చేరింది. కరోనా కట్టడి చర్యల్లో భాగంగా తెలంగాణలో మార్చి 31వరకు లాక్‌డౌన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. లాక్‌డౌన్ అమలు, కరోనా వ్యాప్తి నిరోధ చర్యలపై ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం ఉన్నతస్థాయి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, వైద్యారోగ్య శాఖ, పోలీసు, రెవెన్యూ, పౌరసరఫరాలు, వ్యవసాయ, ఆర్థిక శాఖతో పాటు తదితర శాఖలకు చెందిన ముఖ్య కార్యదర్శులు, ఉన్నతాధికారులు హాజరు అయ్యారు. మరోవైపు ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 492 కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్టు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. కరోనా వైరస్ నియంత్రణ చర్యల్లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి సర్వే చేపడుతోంది. కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలతో సమాచార సేకరణ నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రజల ఆరోగ్య పరిస్థితిపై వీరు పూర్తి స్థాయి రిపోర్ట్ అందించనున్నారు. అలాగే జలుబు, దగ్గు, జ్వరం వంటి వాటితో బాధపడుతున్న వారి వివరాలు సేకరించనున్నారు. రాష్ట్రంలోని 27 వేల ఆశావర్కర్లు, 8 వేల మంది ఏఎన్ఎంల సేవలను ఈ సర్వే కోసం వినియోగించుకోనున్నారు. మరోవైపు నేటి నుంచి గాంధీ, ఫీవర్, చెస్ట్, కింగ్ కోఠి ఆస్పత్రుల్లో ఓపీ సేవలను నిలిపివేశారు. ఇప్పటికే అత్యవసరం కానీ ఆపరేషన్లు నిలిపివేశారు. అలాగే లాక్‌డౌన్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు

ఇళ్లకు క్వారంటైన్ స్టిక్కర్

షాద్‌నగర్‌లో ఓ ఇంటికి అతికించిన పోలీసులు

హైదరాబాద్,మార్చి24(ఆర్ఎన్ఎ): షాద్‌నగర్ విజయనగర్ కాలనీలోని ఓ ఇంటికి వైద్య సిబ్బంది క్వారంటైన్ స్టిక్కర్‌ను అతికించారు. . కాలనీకి చెందిన ఓ యువకుడు ఈ నెల 8న దుబాయి నుంచి వచ్చాడు. అయితే శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అతడిని పరిశీలించిన వైద్యులు.. కరోనా లక్షణాలు లేనట్లు నిర్ధారించి ఇంటికి పంపించారు. కాగా ప్రస్తుతం కరోనా వైరస్ విజృంభిస్తున్న తరుణంలో ఇతర దేశాల నుంచి వచ్చిన వారిని కట్టడి చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు.. వారి ఇంటికి హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు క్వారంటైన్ స్టిక్కర్‌ను అంటించారు. ఆ ఇంట్లో నలుగురు కుటుంబ సభ్యులు ఉంటున్నారనీ.. వారికి కూడా పరీక్షలు నిర్వహించామని, ఎలాంటి కరోనా లక్షణాలు కానరాలేదని తెలిపారు. 14 రోజుల పాటు ఎవరూ కూడా ఆ ఇంటికి వెళ్లరాదని, ఆ ఇంట్లో నివసిస్తున్న వ్యక్తులు కూడా ఇతరులను కలవరాదని శ్రీనివాసులు వివరించారు. దేశ, విదేశాల నుంచి వచ్చే వి మాన ప్రయాణికులు క్వారంటైన్ ముద్ర ఉంటే తప్పకుండా హోం క్వారంటైన్‌కు వెళాల్సిందేనాని శంషాబాద్ జోన్ డీసీపీ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయంలో డొమెస్టిక్ ప్రయాణికులను సోమవారం తనిఖీ చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వస్తున్న ప్రయాణికులను చేతులకు వేసే హోం క్వారంటైన్ ముద్రలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఐదుగురు ప్రయాణికులను వారి స్వస్థలాలకు పంపించారు. లక్నోకు చెందిన ఇద్దరు ప్రయాణికులు, జ గిత్యాల్‌కు చెందిన మరో ప్రయాణికుడు, వేర్వేరు ప్రాంతాలకు చెందిన మ రో ఇద్దరిని హోం క్వారంటైన్‌కు తరలించారు. హోం క్వారంటైన్ ప్రయాణికులు 14రోజులు ఇళ్ల లోపలే ఉండాలని డీసీసీ తెలిపారు. కరోనా లక్షనాలు కలిగి ఉంటే వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలిస్తామన్నారు. ప్రభుత్వం విధిం చిన షట్‌డౌన్‌ను అందరూ పాటించాలని కోరారు. తనిఖీల్లో ఏసీపీ రవిచం ద్ర, ట్రాఫిక్ ఏసీపీ విశ్వప్రసాద్, ఎస్సైలు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కరోనా ఎఫెక్ట్‌తో విద్యా సంవత్సరం అస్తవ్యస్థతం

పరీక్షల వాయిదాతో విద్యార్థుల్లో ఆందోళన

త్వరలోనే ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకునే ఛాన్స్

హైదరాబాద్,మార్చి24(ఆర్ఎన్ఎ): కరోనా కల్లోలం వీడితే తప్ప విద్యారంగ పరిస్థితులపై స్పష్టత రానుంది. పరీక్షలు, అకడమిక్ అన్నది ఇప్పటికైతే అస్పష్టంగానే ఉంది. వాయిదా పడ్డ పరీక్షలపైనా నీలినీడలు కమ్ముకున్నాయి. లాక్‌డౌన నేపథ్యంలో ఇప్పటికిప్పుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకునే అవకావం లేకుండా పోయింది. దీంతో రాష్ట్రంలో ఈ విద్యాసంవత్సరం అస్తవ్యస్తంగా మారింది. ఈ నెల19న టెన్త్ పరీక్షలు స్టార్ట్ కాగా కరోనాతో 3 రోజులకే వాయిదా పడ్డాయి. 23న జరగాల్సిన ఇంటర్ చివరి స్జబెక్టు పరీక్షలు, 22 నుంచి ఏప్రిల్ 4 వరకూ నిర్వహించాల్సిన అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఎగ్జామ్స్, ఏప్రిల్ 4 నుంచి జరగాల్సిన పాలిటెక్నిక్ సెమిస్టర్స్ పరీక్షలు, అన్ని యూనివర్సిటీల్లో జరగాల్సిన పరీక్షలన్నింటినీ వాయిదా వేశారు. పనిదినాలు తగ్గడంతో ఏప్రిల్ చివరి వారంలో పెట్టాలనుకున్న ఇంజినీరింగ్ పరీక్షలూ పోస్ట్‌పోన్ అయ్యే చాన్స్‌ఉంది. ఇంటర్నాట్ వాల్యుయేషన్కూడా వాయిదా పడింది. ఈ కారణాల వల్ల టెన్త్, ఇంటర్ రిజల్ట్స్ఆలస్యంగా వచ్చే అవకాశాలున్నాయి. ఇప్పటికే ఆర్టీసీ సమ్మెతో స్కూళ్లు, కాలేజీలకు చాలా రోజులు సెలవులు రాగా, తాజాగా కరోనా ఎఫెక్ట్‌తో మరిన్ని హాలీడేస్ ప్రకటించాల్సి వచ్చింది. జూన్?లో స్టార్టయిన ఎడ్యుకేషన్? ఇయర్?ఏప్రిల్ నాటికి పూర్తి కావాలి. ఇంటర్?లాంటి కోర్సులైతే ఓ నెల ముందే ముగుస్తాయి. అయితే గతేడాది సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 13 వరకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు సర్కారు దసరా సెలవులు ప్రకటించింది. కానీ ఆర్టీసీ సమ్మెతో అక్టోబర్ 20 వరకూ పొడిగించాల్సి వచ్చింది. ఇప్పుడు కరోనా వైరస్ వ్యాపిస్తున్న నేపథ్యంలో ఈ నెల 16 నుంచి 31 వరకూ హాలీడేస్?అనౌన్స్? చేసింది. ఆ తర్వాత కూడా వైరస్ తీవ్రతను బట్టి ఓపెన్ చేయడమా లేదా సెలవులు కంటిన్యూ చేయడమో చేస్తారు.

ఒకటి నుంచి 9వ తరగతుల వరకు ఏప్రిల్ 7 నుంచి సమ్మెటివ్ అసెస్మెంట్-2 పరీక్షలు నిర్వహించాలను కున్నారు. ఇవి వాయిదా పడే అవకాశం ఉండడంతో ఆయా క్లాసుల్లోని స్టూడెంట్స్‌ను ప్రమోట్ చేసే ఆలోచనల్లో అధికారులున్నారు. దీనిపై ఈనెల 31న నిర్ణయం తీసుకుంటామని ఓ ఉన్నతాధికారి చెప్పారు. అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈ నెల24 నుంచి సమ్మర్? హాలీడేస్? ఉండాలి. కానీ ప్రభుత్వం ఎగ్జామ్స్?నిర్వహించేందుకు మొగ్గుచూపితే, ఏప్రిల్ నెలాఖరు వరకూ కొనసాగే అవకాశముంటుంది. సాధారణంగా ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ స్టూడెంట్స్?కు ఏప్రిల్? చివరివారం నుంచి సెలవులుంటాయి. కానీ ఇప్పుడున్న సెలవుల నేపథ్యంలో వాటిని మే నెలాఖరులో ఇచ్చే చాన్స్ ఉంటుంది.

ఒమర్ అబ్దుల్లాపై నిర్బంధం ఎత్తివేత

శ్రీనగర్,మార్చి24(ఆర్ఎన్ఎ): జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాపై ప్రజా భద్రతా చట్టం (పీఎస్ఏ) కింద అమలు చేస్తున్న నిర్బంధాన్ని కేంద్రం ప్రభుత్వం ఎత్తివేసింది. జమ్మూకశ్మీర్ ప్రిన్సిపల్ సెక్రటరీ రోహిత్ కన్సాల్ ఈ విషయం తెలిపారు. రాజ్యాంగంలో జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణను ఆరు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసినప్పటి నుంచి ఒమర్ అబ్దుల్లా సహా పలువురు రాజకీయ నేతలను గృహనిర్బంధంలోకి తీసుకున్నారు. ఒమర్ అబ్దుల్లా తండ్రి, మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాను ఈనెల ప్రారంభంలో నిర్బంధం నుంచి విడుదల చేశారు. అయితే పీడీఏ చీఫ్ మెహబూబా ముఫ్తీ మాత్రం ఇంకా నిర్బంధంలోనే ఉన్నారు.

24గంటల కరెంట్‌కు ఢోకా లేదు

అన్ని ప్లాంట్లూ పనిచేస్తున్నాయి

కోతలు విధించే ఆలోచన లేదు: సిఎండి

హైదరాబాద్,మార్చి24(ఆర్ఎన్ఎ): తెలంగాణలో లాక్‌డౌన్ కారణంగా కరెంటు కోతలు విధించ బోతున్నారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు అన్నారు. ఎలాంటి ఆలోచన లేదని, అలాగే న ఇరంతర విద్యుత్ సరఫరా యథావిధిగా సాగుతుందన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తికి ఎక్కడా ఆటంకాలు లేవన్నారు. అన్ని ప్లాంట్లు పనిచేస్తున్నాయని, ప్రజలెవరూ ఆందోళన చెందొద్దని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కోరినట్లు కరోనా నియంత్రణకు ప్రజలందరూ కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. ఇళ్ల నుంచి ఎవరూ బయటికి రావొద్దని ప్రభాకర్‌రావు విజ్ఞప్తి చేశారు. కరోనా ప్రమాదం మన ముంగిటే ఉన్నది. దాని తీవ్రత ఎట్లా ఉంటుందో ఇటలీని చూస్తే తెలుస్తుంది. మనదాకా రాదన్న నిశ్చింతకు ఎటువంటి ప్రాతిపదికా లేదు. మనం ఆదమరిస్తే, మనదాకా వస్తుంది. మనల్ని కష్టపెడుతుంది. ప్రజలలో ఎందుకు ఈ లాక్‌డౌన్ భావన ఇంకడం లేదో, వారి శ్రేయస్సుకే ఉద్దేశించిన చర్యలను వారెందుకు సీరియస్‌గా తీసుకోవడం లేదోప్రభుత్వం కూడా ఆలోచించాలి. మరింత నిర్బంధ చర్యలు తీసుకోవడం వల్ల ఫలితం ఉండకపోవచ్చు. తెలంగాణలో కూడా రాష్ట్ర డిజిపి, ప్రధాన కార్యదర్శి సంయుక్త పత్రికాసమావేశంలో అనేక హితవులు, హెచ్చరికలు చెప్పారు. పెద్దగా ఫలితం లేకపోవడంతో సోమవారం రాత్రి కర్ఫ్యూ విధించారు. కరోనా అంశాన్ని తేలికగా తీసుకోగూడదని ప్రజలు గ్రహించాలి. ప్రకటించిన లాక్‌డౌన్‌లు సెలవులు కావు, విహారనమయాలు కావు. ఒక పెనుప్రమాదాన్ని నివారించడానికి చేస్తున్న ప్రయత్నం. ఈ ప్రయత్నంలో కొన్ని ఇబ్బందులు, కష్టనష్టాలు ఉంటాయి. వాటిని తొలగించడానికి ప్రభుత్వాలు ప్రయత్నిస్తాయి కానీ, ప్రజలు కూడా కొన్నిటిని భరించడానికి సిద్ధపడాలి. అల్పాదాయ వర్గాల వారికి, రోజువారీ ఆర్జన ఉండే శ్రేణులకు ఇప్పటికే ప్రకటించిన మద్దతుకు తోడు, మరిన్ని సహాయకాలు కూడా ప్రకటిస్తే బాగుంటుంది. ప్రభుత్వం దాన్ని పరిశీలించాలి. అదే సమయంలో, ప్రజలు ఈ సందర్భాన్ని తమ మీద విధించిన నిర్బంధంగా భావించడం పొరపాటు. అనవసరంగా ఇంత ఆర్భాటం చేస్తున్నారన్న అభిప్రాయం ఎవరిలో ఉన్నా దాన్ని వెంటనే తొలగించుకోవాలన్నారు.

దేశంలో 500 దాటిన కేసుల సంఖ్య

మణిపూర్‌లో తొలి కేసు నమోదు

మలేషియా నుంచి 113 మంది రాక

న్యూఢిల్లీ,మార్చి24(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి దేశంలోని అన్ని ప్రాంతాలకూ విస్తరించింది. ఈశాన్య భారతానికి కూడా ఈ ప్రాణాంతక వైరస్ పాకింది. మణిపూర్ రాష్ట్రంలో కరోనా తొలి కేసు నమోదైంది. ఉత్తర ఇంఫాల్‌కు చెందిన 23 ఏళ్ల వ్యక్తికి వైరస్ సోకినట్టు మంగళవారం నిర్ధారించారు. ఇటీవల లండన్ వెళ్లొచ్చిన ఆ వ్యక్తికి చికిత్స అందితున్నామని, ఆరోగ్యం నిలకడగానే ఉందని అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా కరోనా బాధితుల సంఖ్య 500 దాటింది. కర్ణాటకలో మంగళవారం ఒక్కరోజే కొత్తగా నాలుగు కేసులు నమోదయ్యాయి. ఆ రాష్ట్రంలో మొత్తంగా 37 మంది వైరస్ బారిన పడ్డారు. మరోవైపు మహారాష్ట్ర అత్యధికంగా ప్రభావితం అవుతోంది. దేశంలోనే అత్యధికంగా ఆ రాష్ట్రంలో 97 మందికి వైరస్ సోకింది. సోమవారం ఒక్క రోజే 23 కొత్త కేసులు వచ్చాయి. కేరళ 95 కేసులతో రెండో స్థానంలో ఉంది. మహారాష్ట్రలో కరోనా పాజిటివ్ కేసులు 101కి చేరాయి. ఈశాన్య భారత్‌లో తొలి కరోనా కేసు నమోదు అయింది. మణిపూర్‌లో కరోనా పాజిటివ్ కేసును అధికారులు గుర్తించారు. 23ఏళ్ల మహిళకు కరోనా వైరస్ సోకింది. కాగా ఆ మహిళ ఇటీవలె లండన్‌లో పర్యటించి వచ్చారు. ఇప్పటివరకు ప్రపంచ వ్యాప్తంగా 3,81,293 కరోనా పాజిటివ్ కేసులు రికార్డయ్యాయి. మొత్తం 16,572 మంది మరణించారు. 1,01,344 మంది వైరస్ నుంచి కోలుకున్నారు. భారత్‌లో మొత్తం 492 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

అందులో 451 మంది భారతీయులు కాగా 41 మంది విదేశీయులు. మొత్తం కేసులలో 37 మందికి నయం కాగా 9 మంది ప్రాణాలు కోల్పోయారు. కేరళలో అత్యధికంగా 95 కేసులు నమోదు కాగా మహారాష్ట్రలో 87 కేసులు నమోదయ్యాయి. కర్ణాటకలో 37, రాజస్థాన్‌లో 33, ఉత్తర ప్రదేశ్ 33, తెలంగాణ లో 32, దిల్లీలో 31 కేసులు నమోదయ్యాయి. ఏపీలో ఇంతవరకు 7 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దేశీయ విమాన సర్వీసులనూ నిలిపివేయడంతో కశ్మీరీ విద్యార్థులు కొందరు బెంగళూరు విమానాశ్రయంలో నిరసన తెలిపారు. మార్చి 27, 28 తేదీలకు తాము బెంగళూరు నుంచి విమాన టిక్కెట్లు బుక్ చేసుకున్నామని.. ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని ఓ విద్యార్థి ప్రశ్నించారు. ఇదిలావుంటే కరోనా వైరస్‌కు భయపడి ఇప్పటికే పలు దేశాలలో ఉన్న మనవాళ్లు ఇండియాకు చేరారు. తాజాగా మలేషియాలో చిక్కుకున్న 113 మంది భారతీయులు సోమవారం రాత్రి 10:30 గంటలకు చెన్నైకి చేరుకున్నారు. కరోనా వ్యాప్తి దేశంలో పెరుగుతండటంతో భారత ప్రభుత్వం విదేశాల నుంచి వచ్చే విమానాలను నిషేధించింది. దాంతో మనవాళ్లు చాలామంది చాలా దేశాలలో చిక్కుకున్నారు. ఆ విధంగానే మలేషియాలో చిక్కుకున్న భారతీయులను ఎయిర్ ఏషియా విమానంలో చెన్నైకి తీసుకువచ్చారు.

నిత్యావసర ధరలు పెంచితే చర్యలు

హైదరాబాద్,మార్చి24(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ ఉన్న కాలంలో నిత్యావసర సరుకుల ధరలు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ పౌర సరఫరాల అధికారులు ప్రకటన విడుదల చేశారు. సరుకులను బ్లాక్ మార్కెట్ చేసి అధిక ధరలకు అమ్మితే జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రజల ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకోవడానికి టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. టోకు, చిల్లర వ్యాపారులు ప్రభుత్వ ఆదేశాలకు అనుగూణంగా నడుచుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

పనివాళ్లకు సెలవులు

కరోనా వైరస్ నేపథ్యంలో ఇళ్లలో పని చేసే వారికి సెలవులు ఇచ్చేస్తున్నారు. ఇళ్లతో పాటు అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో పనివాళ్లకు సెలవులు ఇచ్చారు. కొందరు అడ్వాన్స్‌గా వేతనాలు ఇచ్చి తాము చెప్పేంత వరకు పనిలోకి రావొద్దని పంపించి వేశారు. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లోకి పనివారితో పాటు ఇతరులెవరినీ కొద్దిరోజుల పాటు లోనికి అనుమతించవద్దని తీర్మానాలు చేశారు.

ఆలయాల్లో సామూహిక పంచాంగ శ్రవణం నిషేధం

ఉమ్మడి జిల్లా అర్చక సంఘం అధ్యక్షుడు ఆనంద్‌శర్మ

జోగులాంబ గద్వాల ,మార్చి24 (ఆర్ఎన్ఎ): ప్రజల ఆరోగ్యం దృష్ట్యా అర్చక, పురోహితులంతా పెళ్లిళ్ల పంచాంగ శ్రవణం కార్యక్రమాలను వాయిదా వేసుకోవాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అర్చక సంఘం అధ్యక్షుడు, జోగుళాంబ ఆలయ ముఖ్య అర్చకులు దిండిగల్ ఆనంద్ శర్మ పిలుపునిచ్చారు. ప్రభుత్వం సూచనల మేరకు సంఘం తీసుకున్న ఈ నిర్ణయాన్ని అందరూ స్వాగతించాలని కోరారు. ఉగాదిరోజు మాత్రం ఆలయాల్లో అర్చకుడు ఒక్కరు మాత్రమే ఊరంతా వినిపించేలా మైక్ పెట్టుకుని పంచాంగ శ్రవణం చేయాలని సూ చించారు. పంచాంగ శ్రవణంలో భక్తులను ఎవరినీ ఆహ్వానించరాదని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖలో పని చేసే అర్చకులు కూడా ఈ విధానం వర్తిస్తుందన్నారు. ఆయన వెంట ధూపదీప నైవేద్య అర్చక సంఘం గద్వాల జిల్లా అధ్యక్షుడు నరేంద్రచార్యులు ఉన్నారు.

షహీన్‌బాగ్ శిబిరాన్ని ఎత్తేసిన పోలీసులు

న్యూఢిల్లీ,మార్చి24(ఆర్ఎన్ఎ): రోనా వైరస్ వ్యాపిస్తున్న తరుణంలో ఢిల్లీ లాక్ డౌన్ ప

స్వచ్ఛత వ్యవస్థీకృతం కావాలి..!

'ఏకాంతం'-ఐసోలేషన్- 'కరోనా' నిరోధక, 'కరోనా' నిర్మూలక చికిత్సలో వౌలిక అంశమైపోయింది! దశాబ్దుల తరబడి ఒకదాని తరువాత మరొకటిగా ప్రపంచాన్ని ముంచెత్తుతున్న చిత్రవిచిత్ర భయంకర వ్యాధులలో ఈ 'కరోనా' పరాకాష్ఠ. ఇంతగా ప్రపంచాన్ని భయవిభ్రాంతికి గురిచేసిన వ్యాధి మరొకటి లేదు. ఇంత పెద్ద ఎత్తున ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవలసిన అనివార్యం గతంలో ప్రబలిన విచిత్ర వ్యాధులు కల్పించలేదు! పాఠశాలలు మూసివేశారు, విమానాల రాకపోకలను రద్దుచేస్తున్నారు, ఎక్కువ సంఖ్యలో జనం కలిసే సభలను, సమావేశాలను, ఉత్సవాలను, శోభాయాత్రలను, జాతరలను, సమ్మేళనాలను రద్దుచేశారు. మన ప్రధానితో సహా వివిధ దేశాల ప్రభుత్వ నేతలు విదేశాల పర్యటనలు రద్దుచేసుకున్నారు. కేంద్ర మంత్రులు విదేశాలకు పోరాదట! కొన్ని దేశాలలో జనం ఇళ్లనుంచి బయటికి రాకుండా ప్రభుత్వాలు కట్టడి చేశాయి. దేవాలయాలు సైతం మూతపడుతుండడం సమస్య తీవ్రతకు పరాకాష్ఠ. అనేక దేశాలలో ఎన్నికలు వాయిదాపడినాయి. మన దేశంలో కూడ ఇదే కథ నడుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల వాయిదాకు కారణం చెలరేగిన రాజకీయ దౌర్జన్యకాండ కంటె, 'కరోనా' ప్రమాదం ప్రధాన కారణం! ఒకరికొకరు దూరంగా ఉండాలన్నది చికిత్స, కరచాలనాలు, బహిరంగ ఆలింగనాలు రద్దయిపోయాయి. చివరికి మన చేతులతోనే మన ముక్కును, మన కళ్లను, మన చెవులను, మన చెంపలను ముట్టరాదన్నది 'కరోనా'హడలెత్తిస్తున్న తీరునకు నిదర్శనం!

ఉన్నత న్యాయస్థానాలు కేవలం అత్యవసర అనివార్య వివాదాలను మాత్రమే విచారిస్తుండడం కరోనా ప్రమాదంపై ప్రకటించిన యుద్ధప్రాధాన్యానికి ధ్రువీకరణ...ప్రమాదం, వైపరీత్యం, విలయం, ప్రాకృతిక బీభత్సం ముంచుకొని వచ్చినప్పుడు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి...కానీ ఇవి ముంచుకొని రాకుండా ఇలాంటివి, ఇలాంటి రోగాలు పుట్టకుండా శాశ్వతంగా నిరోధించే సమన్వయ జీవన విధానాన్ని మనం తప్పనిసరి చేసుకోలేమా?? అన్న మథనం జరుగవలసిన తరుణం ఇది. ఈ 'సమన్వయం' మన వివిధ అలవాట్లమధ్య, పద్ధతుల మధ్య, ఆలోచన రీతుల మధ్య, ప్రవృత్తుల మధ్య జరగాలి! మనిషికీ మనిషికీ మధ్య సమన్వయం కలిగి ఉండడం ఉత్తమ కుటుంబం. కుటుంబ జీవన పద్ధతుల మధ్య సమన్వయం హార్మోనీ సామాజిక సమన్వయం...సమాజానికీ ప్రకృతికీ మధ్య సమన్వయం సృష్టివికాస క్రమం! "అఖండ మండలాకార"మైన విశ్వవ్యవస్థలో ఏ బిందువు స్వచ్ఛత చెడిపోయినప్పటికీ మొత్తం విశ్వవ్యవస్థ స్వచ్ఛత భంగపడడానికి అది క్రమక్రమంగా దోహదం చేస్తోంది! మానవుడు విశ్వవ్యవస్థలోని అనేక 'బిందువుల'లో ఒకడు. మానవ సమాజం, ధరాతల జీవజాలంలో ఒక ప్రధాన అంశం... జీవజాలం ప్రకృతి! అందువల్ల ప్రధాన అంశమైన మానవ జీవనం స్వచ్ఛతను కోల్పోతూ ఉండడం ప్రకృతి క్రమంగా గాయపడుతుండడానికి కారణం. గాయపడుతున్న ప్రకృతి గాయపరుస్తోంది! అందువల్లనే గతంలో ఊహించని రోగాలు, రోగక్రిములు ఇతరేతర విచిత్రాలు విరుచుకొని పడుతున్నాయి. ఒకదాన్ని నిరోధించి నిర్మూలించిన వెంటనే మరి ఒక విచిత్ర రోగం విస్తరిస్తోంది. ఇలా ఒకటి కాదు. ఇంకా ఇంకా ఎన్నో జబ్బులు! వ్యాధి వచ్చిన తరువాత చికిత్స చేయవచ్చు, కానీ వ్యాధి రాకుండా, ప్రకృతి రుగ్మతకు గురికాకుండా నిరోధించ గల జీవనరీతి మళ్లీ సమాజంలో వ్యవస్థితం ఎందుకు కారాదు?? ఒకప్పుడు, సహస్రాబ్దుల తరబడి, ఇలాంటి సమన్వయ జీవన పద్ధతి మన దేశంలో వ్యవస్థీకృతమై ఉండేది! మానవుడు, కుటుంబంలోను, కుటుంబం సమాజంలోను, సమాజం ప్రకృతిలోను, ప్రకృతి విశ్వవ్యవస్థలోను అవిభాజ్యం అన్న జీవన పద్ధతి స్వచ్ఛతను కాపాడింది! ఈ జీవన స్వచ్ఛత కలిగిన భారతీయులు ప్రాకృతిక స్వచ్ఛతను విశ్వవ్యవస్థ సమన్వయాన్ని రక్షించారు! ఇలా రక్షణ పొందిన ప్రకృతి ప్రజలను కాపాడింది. చేతులు మాత్రమే కాదు రోజంతా అప్పుడప్పుడు చేతులను, కాళ్లను, ముఖాన్ని మొత్తం శరీరాన్ని కడగికొనడం ఈ దేశంలో జీవన విధానం. 'స్వచ్ఛత'ను రక్షించడం తాత్కాలిక చర్యగాకాక, శాశ్వత జీవన సహజ విధానంగా వ్యవస్థీకృతం కావాలి!

నేటినిజం
బుధవారం 25-3-2020

సరుకులు అధిక ధరలకు అమ్మితే చర్యలు

-కరోనా నేపథ్యంలో మంత్రి తలసాని హెచ్చరిక

హైదరాబాద్,24మార్చి(ఆర్ఎన్ఎ): నిత్యావసర వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వ్యాపారులను హెచ్చరించారు. కరోనా నేపథ్యంలో ధరలు పెంచితే చర్యలు తప్పవన్నారు. మహమ్మారి నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం తెలంగాణ లాక్‌డౌన్ ప్రకటించిందన్నారు. ప్రస్తుత పరిస్థితులను అదును చేసుకుని వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టించి , ధరలను పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 31వ తేదీ వరకూ లాక్‌డౌన్ ఉన్న నేపథ్యంలో ఎవరైనా వ్యాపారులు అధిక ధరలకు విక్రయాలు జరిపితే నిత్యావసర వస్తువుల చట్టం, ఇతర చట్టాలకింద క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఎవరైనా ఎమ్మార్పీకి మించి నిత్యావసరాలను విక్రయిస్తే డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజలు స్వీయ నియంత్రణ పాటించి ఇండ్లలోనే ఉండి కరోనా నిర్మూలనకు సహకరించాలన్నారు. ప్రజలు రోడ్లపైకి రావద్దన్నారు. దీంతో వారికే నష్టమని అన్నారు. కరోనా అంటుకుంటే వదిలేది కాదని, అందువల్ల ప్రజలు స్వీయ నియంత్రణ పాటించాలని మంత్రి తలసాని సూచించారు.

భూముల జీవోలపై హైకోర్టు స్టే

అమరావతి,24మార్చి(ఆర్ఎన్ఎ): అమరావతి రాజధాని ప్రాంతంలో వేరే ప్రాంతాలవారికి భూములిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోపై హైకోర్టు స్టే ఇచ్చింది. గుంటూరు, విజయవాడ, దుగ్గిరాల, పెదకాకాని ప్రాంతాలకు చెందిన?51 వేలమందికి 1,215 ఎకరాల భూమి కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ జీవోపై ఆగ్రహం వ్యక్తం చేసిన రాజధాని రైతులు.. జీవోను హైకోర్టులో సవాల్ చేశారు. రాజధాని గ్రామాల్లోని పేదలకు మాత్రమే భూములివ్వాలని?సీఆర్డీఏ చట్టంలో ఉందని రైతుల తరపు న్యాయవాదులు వాదించారు. ఇరువైపు వాదనలు విన్న అనంతరం న్యాయస్థానం ఈ మేరకు స్టే ఇవ్వడంతో ప్రభుత్వంలో సమాలోచనలు జరుపుతోంది.

ఇరాన్‌లో 1812కు చేరుకున్న కరోనా మృతులు

టెహ్రాన్,24మార్చి(ఆర్ఎన్ఎ): ఇరాన్‌లో కరోనా మృత్యుఘంటికలు మోగిస్తూనే ఉంది. రోజురోజుకు మృతులసంఖ్య పెరుగుతోంది. తాజాగా వైరస్ వల్ల మృతిచెందిన వారి సంఖ్య 1812కు చేరుకున్నది. ఈ విషయాన్ని ఆ దేశ ఆరోగ్యశాఖ అధికారి కియనోష్ జహాన్‌పూర్ తెలిపారు. దేశంలో మొత్తం 23 వేల 49 మందికి కరోనా వైరస్ సోకినట్లు ఆయన చెప్పారు. దాంట్లో సుమారు 9 వేల మందికి కరోనా సయమైంది. నిన్నటి నుంచి 1411 కొత్త కేసులను నమోదు చేసినట్లు తెలిపారు. గత 24 గంటల్లో 127 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆయన చెప్పారు. దేశవ్యాప్తంగా దాదాపు 36 మిలియన్ల మందిని కరోనా స్క్రీనింగ్ చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఆదేశాలు పాటిస్తున్నా

సెల్ఫ్ క్వారంటైన్‌లో ఉన్నా: క్రికెటర్ సంగక్కర

కొలంబో,24మార్చి(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా తాను సెల్ఫ్ క్వారంటైన్‌లో ఉన్నానని శ్రీలంక దిగ్గజ క్రికెటర్ కుమార సంగక్కర తెలిపారు. యూరప్ నుంచి శ్రీలంకకు వచ్చిన ప్రతి ఒక్కరు సెల్ఫ్ క్వారంటైన్‌లో ఉండాలని శ్రీలంక ఆదేశించింది. కరోనా వైరస్ వ్యాప్తి కట్టడిలో తనవంతు బాధ్యతగా 14 రోజుల పాటు స్వీయ నిర్బంధంలో ఉండనున్నట్లు సంగక్కర తెలిపాడు. 'నాకు కరోనా లక్షణాలేవీ లేవు. కానీ నేను ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తున్నాను. వారం రోజుల క్రితమే నేను లండన్ నుంచి వచ్చాను. మార్చి 1-15 మధ్య విదేశాల నుంచి వచ్చిన వారంతా తప్పకుండా పోలీస్ స్టేషన్‌లో తమ వివరాలు నమోదు చేయించుకోవాలని ఆ తర్వాత సెల్ఫ్ క్వారంటైన్‌లో ఉండాలన్న విషయాన్ని వార్తల్లో చూశాను. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుసరిస్తూ పోలీసుల వద్ద పేరు నమోదు చేసుకొని నిర్బంధంలో ఉన్నానని' సంగక్కర పేర్కొన్నాడు.

మహమ్మారిని అరికట్టేలా చర్యలు

ప్రభుత్వానికి ప్రజలు సహకరించాలి

ఉమ్మడి జిల్లా అధికారులతో మంత్రి సమీక్ష

నల్లగొండ,24మార్చి(ఆర్ఎన్ఎ): మహమ్మారిలా విస్తరిస్తున్న కరోనాను కంట్రోల్ చెయ్యడంలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. మానవాళి మనుగడ కోసమే ప్రభుత్వాలు కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నాయి. నిత్యావసర సరుకులు అందించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ సత్వర నిర్ణయాలు తీసుకుంటున్నారు. సమస్యను అరికట్టేందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ 31 వరకు లాక్ డౌన్ ప్రకటించారు. కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్ పరిస్థితిపై మంత్రి జగదీశ్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో నల్లగొండ, సూర్యపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అప్రమత్తంగా ఉండక పోతే అనర్థాలు చవిచూడాల్సి ఉంటుంది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు లాక్‌డౌన్ పై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినందున ప్రజలు విధిగా సహకరించాలి. చట్టం ఉల్లంఘన అనేది ఏ ఒక్కరికి మినహాయింపు కాదు. నిబంధనలు ఉల్లంఘన జరిగితే పరిస్థితులు చెయ్యి దాటి పోయే ప్రమాదం ఉంది. స్వీయనియంత్రణ తోటే వైరస్ ను అరికట్టొచ్చు. ఏ నిర్ణయం తీసుకున్న ప్రజల ఆరోగ్యభద్రత కొరకే అన్నది గుర్తించుకోవాలి. కనబడని వైరస్ సృష్టించిన అల్లకల్లోలం ప్రజలకు తెలియంది కాదు. తమంతట తామే లాక్‌డౌన్ విజయవంతం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

అంబులెన్స్‌ల వ్యాపార దందా

జనాలను సరిహద్దులు దాటిస్తూ పట్టబడ్డ వ్యాన్

హైదరాబాద్,24మార్చి(ఆర్ఎన్ఎ): కరోనావైరస్ మహమ్మారి విస్తరించకుండా ముందు జాగ్రత్తగా తెలుగు రాష్ట్రాల్లో లాక్‌డౌన్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ప్రజారవాణా మొత్తం బంద్ అయింది. అత్యవసర విభాగాలకు చెందిన వాహనాలను తప్ప వేటిని రోడ్లపైకి అనుమతించడం లేదు. ఇదే అదనుగా ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు రెచ్చిపోతున్నారు. పేషెంట్ల ముసుగులో ప్రయాణికులను తరలిస్తున్నారు. కోదాడ దగ్గర ఈ దందా బయటపడింది. పెషెంట్ల ముసుగులో హైదరాబాద్ నుంచి విజయవాడకు ప్రయాణికులను తరలిస్తున్నారు. ఒక్కో ప్రయాణికుడి నుంచి అంబులెన్స్ డ్రైవర్లు వెయ్యి రూపాయిలు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అంబులెన్స్ కావడంతో ప్రతి చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు బారికేడ్లను తీసి పంపించారు. కానీ కోదాడ వద్ద పోలీసుల తనిఖీల్లో బయటపడ్డారు. అంబులెన్స్ డ్రైవర్లు డబ్బులు తీసుకొని ప్రయాణికులను రాష్ట్ర సరిహద్దు దాటిస్తున్నారన్న సమాచారంతో కోదాడ పోలీసులు రామపురం చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేపట్టారు. అటుగా వచ్చిన మూడు అంబులెన్స్‌ను తనిఖీలు చేయగా ప్రయాణికులు బయటపడ్డారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రయాణికులతో పాటు అంబులెన్స్ డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. అయితే పబ్లిక్ ట్రాన్స్ పోర్టు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. పోలీసులు ప్రైవేట్ వాహనాలను కూడా అడ్డుకోవడంతో కొత్త దందా షురూ అయ్యింది. అంబులెన్స్‌లో ప్రయాణికుల తరలింపు ఘటన వెలుగులోకి రావడంతో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు మరింత అప్రమత్తం అయ్యారు. ఇకపై హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో.. హైవే రోడ్లపై ఇకపై చెకింగ్ చేయాలని పోలీసులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

లాక్‌డౌన్ నేపథ్యంలో జిల్లాల్లో కఠినంగా ఆంక్షలు

రంగంలోకి దిగిన పోలీసులు..రోడ్లపై జనాలు రాకుండా చర్యలు

డిజిపి ఆదేశాలతో పలుచోట్ల వాహనదారులకు జరిమానాలు

హైదరాబాద్,24మార్చి(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ కట్టడిలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం మార్చి 31వరకు లాక్‌డౌన్ ప్రకటించిన నేపథ్యంలో పోలీసులు కఠిన చర్యలకు ఉపక్రమించారు నిబంధనలు ఉల్లంఘించి రోడ్డెక్కుతున్న వారిని కట్టడి చేస్తున్నారు. అవసరమైతే వాహనదారులకు హెచ్చరిక చేస్తూ వెనక్కి పంపు తున్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రజలను ఇళ్లకే పరిమితం కావాలని సిఎం కెసిఆర్ కోరిన సంగతి తెలిసిందే. కేంద్రం కూడా ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటేనే కరోనా వ్యాప్తిని అరికట్టగలమని చెబుతోంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత చెప్పినా చాలా చోట్ల జనాలు వినిపించుకోవడం లేదు. పోలీసులు అవగాహన కల్పిస్తున్న పట్టించుకోవడం లేదు.లాక్‌డౌన్ నిబంధనలు అతిక్రమించి రోడ్లపైకి చేరకుంటు న్నారు. ఈ నేపథ్యంలో డీజీపీ మహేందర్‌రెడ్డి ఆదేశాలతో అప్రమత్తమైన పోలీసులు పలుచోట్ల బారికేడ్స్ ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో లాక్‌డౌన్ ఉల్లంఘించి రోడ్లపైకి వచ్చిన 20 ప్రైవేటు వాహనాలను డీటీసీ శ్రీనివాస్ సీజ్ చేశారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో లాక్‌డౌన్ నిబంధనలు అతిక్రమించి రోడ్లపైకి వచ్చిన ప్రజలను అదుపు చేయడానికి కలెక్టర్ కృష్ణ భాస్కర్ స్వయంగా రంగంలోకి దిగారు. రోడ్డుపై తిరుగుతున్న కార్లను, ఆటోలను నిలిపివేసి ఫైన్ వేయించారు. రోడ్లపైకి వచ్చినవారిని మీకేమైనా ప్రత్యేకమైన రూల్స్ ఉన్నాయా అని ప్రశించారు. ఇంట్లో నుంచి అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు వెళ్లాలని.. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. లీడర్‌ను అంటూ ప్రభుత్వ అధికారులతో దురుసుగా మాట్లాడిన తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లికి చెందిన గుగ్గిళ్ళ శ్రీకాంత్ గౌడ్‌పై కేసు నమోదు చేయాలని అధికారులను కలెక్టరు ఆదేశించారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండల కేంద్రంలో లాక్‌డౌన్ నిబంధనలను ఉల్లంఘించి ప్రజా రవాణా చేస్తున్న పలు ఆటోలను, ఇతర వాహనాలను ఎస్ఐ అశోకుమార్ అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇకపై కర్ఫ్యూ ధిక్కరించి తిరిగే వాహనాలను సీజ్ చేస్తామని అశోక్‌కుమార్ ప్రకటించారు. నల్గొండ జిల్లాలో ప్రజలు పెద్ద ఎత్తున రోడ్లపైకి రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లాలో ఎక్కడికక్కడ చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసి వాహనాలు నిలిపివేస్తున్నారు. హైవే పై టోల్‌గేట్‌లను పూర్తిగా మూసివేశారు. అత్యవసరం ఉంటే తప్ప ఎవరినీ రోడ్లపై అనుమతించమని పోలీసులు స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్‌లో లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించి ప్రజలు గుంపులు గుంపులుగా రోడ్లపైకి రావడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను అదుపు చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అత్యవసర సమావేశం నిర్వహించారు. ప్రజలు అత్యవసరం ఉంటే తప్ప బయటకు వెళ్లవద్దని ఆదేశాలు జారీచేశారు. కరోనా వైరన్‌ను అంతమొందించడం మన అందరి బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా రోడ్లపైకి వస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆటోలు, క్యాబ్‌లకు అనుమతి లేదు

లాక్‌డౌన్ నిబందనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

హెచ్చరించిన సైబరాబాద్ కమిషనర్ సజ్జన్నార్

హైదరాబాద్,24మార్చి(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సైబరాబాద్ సీపీ సజ్జనార్ అన్నారు. అంబులెన్స్‌లలో జనాలను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆటో, క్యాబ్‌లను తిప్పొద్దని, లేకుంటే క్రిమినల్ కేసులు పెడతామని సజ్జనార్ హెచ్చరించారు. ఓలా, ఉబెర్ సర్వీసులు కూడా ఆపేయాలని ఆదేశించారు. రాష్ట్రప్రజలంతా దయచేసి లాక్‌డౌన్ నిబంధనలను పాటించాలని సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో సీపీ సజ్జనార్ మాట్లాడుతూ..ప్రజలెవరూ బయట తిరుగొద్దని సూచించారు. క్యాబ్స్ బుక్ చేసుకోవద్దు. అనుమతించిన వాహనాల్లోనూ సోషల్ డిస్టెన్స్ పాటించాలని సూచించారు. ఆంబులెన్స్‌లను ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. హోమ్ క్వారంటైన్ నుంచి బయటికి వస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని చెప్పారు. మానిటరింగ్ కోసం టీమ్‌లను పెంచుతామని, ప్రజలు లాక్‌డౌన్‌ను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. రాత్రి 7 గంటలకు అన్ని షాపులు మూసేయాలని ఆయన ఆదేశించారు. అనవసరంగా వాహనాలతో రోడ్డెక్కితే ఫైన్ వేస్తామని, ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సజ్జనార్ హితవుపలికారు. ఓలా, ఉబర్ సంస్థలు కూడా క్యాబ్స్ మూసివేయాలి. నడిపిస్తే కేసులు వేస్తమని సీపీ హెచ్చరించారు. సోషల్ డిస్టెన్స్ ఉల్లంఘిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటమని హెచ్చరించారు. చెక్‌పోస్టుల దగ్గర తనిఖీలు ముమ్మరం చేసినం. పిల్లల్ని కూడా ఇండ్లకే పరిమితం చేయాలి. బహిరంగ ప్రదేశాల్లో గుమిగూడొద్దు. నిత్యవసర సరుకులు అమ్మే షాపులైనా సాయంత్రం 7 నుంచి మూసివేయాలని ఉదయం 6 గంట నుంచి 7 గంటల వరకు షాపులు తెరవాలి. ఫుడ్ డెలివరీ ఆర్డర్లు కూడా సాయంత్రం 6 గంటలలోపే మూసివేయాలన్నారు. ప్రజలు ఊళ్ల ప్రయాణాలు మానుకోవాలని సీపీ సూచించారు.

6 రాష్ట్రాల్లో పాక్షికంగా లాక్ డౌన్

కరోనా పరీక్షల కిట్ తయారీ సంస్థలకు అనుమతి

కేంద్ర వైద్యరోగ్య శాఖ అధికారుల వెల్లడి

న్యూఢిల్లీ,24మార్చి(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాలు లాక్‌డౌన్ అయ్యాయని, 6 రాష్ట్రాల్లో పాక్షికంగా లాక్ డౌన్ పాటిస్తున్నారని కేంద్ర వైద్యరోగ్య శాఖ తెలిపింది. ఐసీఎంఆర్ డైరెక్టర్ బలరామ్ భార్గవ, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ లవ్ అగర్వాల్ సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడుతూ కరోనా వైరస్ వ్యాపించకుండా చైన్ బ్రేక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నమని చెప్పారు. మాస్కులు, శానిటైజర్లు నిర్దేశించిన ధరల కంటే ఎక్కువ ధరకు విక్రయించవద్దని నిర్దేశించారు. కరోనా పరీక్షల కిట్ తయారీ కోసం రెండు సంస్థలకు అనుమతి ఇచ్చాం. మాస్కులు, శానిటైజర్ల తయారీలో నిర్దేశించిన ప్రమాణాలు పాటించాలన్నారు. కోవిడ్-19 బాధితుల కోసం ఆస్పత్రులను సిద్ధం చేయాలని రాష్ట్రాలను కోరుతున్నట్టు ఐసీఎంఆర్ డైరెక్టర్ బలరామ్ భార్గవ చెప్పారు. కరోనా పరీక్షల కేంద్రాలకు మార్గదర్శకాలు రూపొందించాం. దేశవ్యాప్తంగా 15000 కేంద్రాల్లో నమూనాలు సేకరిస్తున్నాం. ప్రైవేట్ సంస్థలకు కరోనా పరీక్షలు అనుమతిస్తే పరీక్షల రుసుం రూ.4 వేల నుంచి రూ.5 వేల మధ్య మాత్రమే ఉండాలన్నారు. ఇప్పటివరకు 415 కేసులు నమోదయ్యాయి. 23 మంది డిశ్చార్జ్ అయ్యారు. 7 మరణాలు చోటుచేసుకున్నాయని లవ్‌అగర్వాల్ తెలిపారు.

433కు చేరుకున్న కరోనా కేసుల సంఖ్య

దేశంలో కరోనా కేసులు పెరిగిపోయాయి. తాజాగా తెలంగాణ రాష్ట్రంలో నమోదైన 3 కేసులతో సోమవారం మధ్యాహ్నానికి దేశంలో కరోనా కేసుల సంఖ్య 433కు చేరుకుంది. దేశంలో కరోనాను కట్టడి చేసేందుకు దేశంలోని వివిధ రాష్ట్రాలు ఈ నెల 31 వరకు లాక్‌డౌన్ ప్రకటించాయి. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, తమిళనాడు, బిహార్ రాష్ట్రాలు ఈ లాక్‌డౌన్‌ను ప్రకటించాయి. దేశం మొత్తంలో కరోనా కేసులు ఎక్కువగా మహారాష్ట్రలో నమోదు అయ్యాయి. కొత్తగా 15 కేసులతో మొత్తం 89 కరోనా కేసులు రాష్ట్రంలో నమోదు అయ్యాయి. ఇక తర్వాతి స్థానంలో కేరళ ఉంది. కేరళలో ఇప్పటి వరకు 67 కేసులు నమోదు అయ్యాయి. ఢిల్లీ 26, ఉత్తరప్రదేశ్ 29, తెలంగాణ 33, రాజస్తాన్, 27, హర్యానా 23, కర్ణాటక 26 కేసులు నమోదు అయ్యాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇక ఆదివారం ఒక్క రోజే దేశంలో ఏడుగురు కరోనాతో మృతి చెందారు. ఇప్పటికే దేశంలో 80 జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించిన విషయం తెలిసిందే.

కరోనా ఆదేశాలు ఉల్లంఘన

కొత్తగూడెం డిఎస్పీపై కేసు నమోదు

33కు చేరిన కరోనా కేసుల సంఖ్య

తెలంగాణలో ఒక్క కేసూ నమోదు కాలేదన్న ఈటెల

లాక్‌డౌన్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

హైదరాబాద్,మార్చి24(ఆర్ఎన్ఎ): విదేశాల నుంచి వచ్చిన క్వారంటైన్‌లో ఉండాలని తెలంగాణ సర్కార్ పదేపదే చేసిన హెచ్చరికలను బేఖాతరు చేసిన ఓ పోలీస్ అధికారిపై కేసు నమోదు చేశారు. క్వారంటైన్‌లో ఉండని వారిపై కఠిన చర్యలు తప్పవని ఇదివరకే ప్రభుత్వం హెచ్చరించింది. అయితే.. విదేశాల నుంచి వచ్చిన కొందరు మాత్రం ఇష్టానుసారం బయట తిరిగేస్తున్నారు. క్వారంటైన్‌లో ఉండని వారిపై సోమవారం నాడు తెలంగాణ సర్కార్ కొరడా ఝుళిపించింది. ద 60 మందికి పైగా కేసులు నమోదు చేయడం జరిగింది.ఈ విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలని పోలీసులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. చట్టాన్ని ఉల్లంఘించి ఇళ్ల నుంచి భయటికి వచ్చే వారిని ఉపేక్షించొద్దని ప్రభుత్వం నుంచి పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది.ఇదిలా ఉంటే.. క్వారంటైన్‌లో ఉండనందుకు కొత్తగూడెం డీఎస్పీపై అధికారులు కేసు నమోదు చేశారు. అయితే.. డీఎస్పీ కుమారుడు కరోనా పాజిటివ్ రావడంతో వైద్యం కోసం రాగా కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. కాగా.. ఈ నెల 31 వరకు రాష్ట్ర ప్రజలు ఎవరి ఇళ్లలో వారుండాలని.. క్వారంటైన్ స్టాంప్ వేసిన వారు కూడా బయట తిరుగుతున్నారని.. వాళ్లను బయటకు వెళ్లనివ్వొద్దని తలిదండ్రులకు ఇదిరకే తెలంగాణ మంత్రి ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం మాట పెడెనచెవిన పెడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని మంత్రి హెచ్చరించారు. తెలంగాణలో కరోనా పాజిటివ్ కేసులో 33కు చేరాయి. 33 మందిలో ఒక్కరి పరిస్థితి కూడా విషమంగా లేదని మంత్రి ఈటల వెల్లడించారు. హోం క్వారంటైన్‌లో ఉన్నవాళ్లు కూడా బయట తిరుగుతున్నరు. కరోనా స్టిక్కర్ వేయించుకున్న వాళ్లు ఎట్టి పరిస్థితుల్లో బయటతిరగొద్దని మంత్రి ఈటల కోరారు. హోం క్వారంటైన్‌లో ఉన్నవాళ్లు ఇష్టమొచ్చినట్లు తిరిగితే ఊరుకునేది లేదని మంత్రి ఈటల హెచ్చరించారు.ఎవరికి వారు ఇండ్లకు పరిమితమైతే కరోనా నియంత్రణలోకి వస్తుందని వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. దయచేసి ఇండ్ల నుంచి ఎవరూ బయటికి రావొద్దని మంత్రి ఈటల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు కరోనా వైరస్‌తో తెలంగాణ వ్యక్తి ఒక్కరు కూడా చనిపోలేదు. కరోనా పాజిటివ్ వచ్చిన వ్యక్తి కూడా వెంటిలేటర్‌పై లేరు. ఇతర దేశాల నుంచి వచ్చిన వాళ్ల సమాచారం కాలనీవాసులు, బస్తీవాసులు ఇవ్వాలి. ఈ మధ్య కాలంలో విదేశాల నుంచి 20 వేల మంది వచ్చారు. విదేశాల నుంచి వచ్చిన 20 వేల మందిపై నిఘా పెట్టినం. డ్యూటీలో ఉన్న డాక్టర్లు, నర్సులు, సిబ్బందిని కంటికి రెప్పలా కాపాడుకుంటం.

దేశీయ విమానాల నిలిపివేత

కరోనా వ్యాప్తితో కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ,24మార్చి(ఆర్ఎన్ఎ): భారత్‌లో అంతర్గత విమానాల రాకపోకలను నిలిపివేస్తూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. సోమవారం అర్ధరాత్రి నుంచి అన్ని విమానాలు రద్దవుతాయి. భారత్‌లో మొత్తం కరోనా కేసుల సంఖ్య 400 దాటిన నేపథ్యంలో దేశీయ విమానాల రాకపోకలపై కూడా నిషేధం విధించాలని నిర్ణయించారు.

అలాగే మంగళవారం అర్ధరాత్రికి అన్ని విమానాలు రద్దు కానున్నాయి. ఈ మేరకు కేంద్రం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. రైళ్లు,

వైద్యులు,పోలీసులు కృషి అభినందనీయం

హైదరాబాద్, మార్చి 24:లాక్‌డౌన్‌తో కరోనా వ్యాధి వ్యాప్తిని అరికట్టే ప్రయత్నంలో ప్రతి ఒక్కరూ కృషి చేస్తున్నారు. రోడ్లపైకి జనం రాకుండా పోలీసులు చేస్తున్న కృషి అమోఘం. వారు గతంలో కన్నా మరింత అప్రమత్తంగా తమ విధులను నిర్వహిస్తున్నారు. రోడ్డుమీద పోలీసులు, ఆస్పత్రుల్లో వైద్యులు, ఇతర పారామెడికల్ సిబ్బంది చేస్తున్న కృషిని మనమంతా అభినందించాలి. ఆదివారం సాయంత్రం 5గంటలకు ప్రధాని పిలుపుతో చప్పట్లతో వారికి అండగా నిలిచాం. అయితే ఇప్పుడు ఈ రెండు విభాగాల సిబ్బందిని గుర్తించి ప్రభుత్వాలు వారికి అన్ని రకాలు సౌకర్యాలు కల్పించాలి. వారికి సేదదీరే సమయం ఇవ్వాలి. వంతులవారీగా డ్యూటీలు వేయాలి. వైద్యులు మరీ అలసిపోకుండా చూసుకోవాలి. వారికి సమయానికి ఆహారం, నిద్ర అందేలా చూడాలి. పోలీస్, వైద్ విభాగాలు అలసిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. ఇకపోతే కరోనా కారణంగా లాక్‌డౌన్‌తో దేశవ్యాప్తంగా కాలుష్యం తగ్గింది. వాహనాలు రోడ్లపైకి రాకపోవడంతో ప్రమాదాలు పూర్తిగా తగ్గాయి. పెట్రోల్, డీజిల్ వాడకం తగ్గిపోయి కాలుష్యం తగ్గింది. అలాగే వందల కోట్ల వినియోగం తగ్గింది. మొత్తంగా కరోనా చేస్తున్న మంచి పనుల్లో వీటిని చేర్చుకోవాలి. ప్రజలు గుంపులుగా తిరగడం వల్ల ఒకరినుంచి మరొకరికి సంక్రమిస్తున్నందున దూరం పాటించాలని కోరుతున్నారు. అందుకే ప్రజలు కూడా ఇళ్లకే పరిమితం కావాలి. అదే పనిగా ఆహార వస్తువులను నిల్వ చేసుకోవాల్సిన పనిలేదు. మనదేశంలో ఆహార పదార్థాలకు కొదువు లేదు. గోడౌన్లలో పుష్కలంగా నిండి వున్నాయి. అంచనాలకు మించి పంటలు పండాయి. అయితే వీటి కోసం జనం మార్కెట్లపై ఎగబడేందుకు అదేపనిగా బయటకు రాకుండా చూసు కోవాలి. ఇకపోతే కరోనా అన్నది కనీవినీ ఎరుగని కొత్త వైరస్ కావడంతో దీని వ్యాప్తి జరగకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు అనుగుణంగా మనం నడచుకోవాలి. భూకంపమో సునామియో వరదలో క్షామమో అయితే దాని ప్రభావం కొన్ని ప్రాంతాలకే పరిమితం అవుతుంది. తరవాత కేవలం సహాయక చర్యలతో సరిపోతుంది. కానీ కరోనా మనిషి నుంచి మనిషికి తెలియకుండా వ్యాప్తి చెందే మహమ్మారి కనుక నిర్లక్ష్యం వహిస్తే ఊళ్లకఊళ్లు శ్మశానాలుగా మారిపోయే ప్రమాదం ఉంది. గతంలో వచ్చిన గత్తర, మశూచి లాంటి ప్రమాదాల కంటె ఇది భిన్నమైనదే గాకుండా ప్రమాదకరమైనది కావడంతోనే ఇంతగా అప్రమత్తంగా ఉండాల్సిన ఆగత్యం ఏర్పడింది. ఇది లోకాన్ని మొత్తంగా తుడిచిపెట్టేసే మహమ్మారి. అభివృద్ధి చెందిన దేశాలనే అల్లల్లాడిస్తోంది. కరోనా మనుషుల శ్వాసకోశం మీద దాడిచేసి ఊపిరి హరిస్తున్నది. బలహీనులను వయోధికులను గురిపెట్టి మట్టుపెడుతోంది. మనుషుల మధ్య వ్యాపిస్తున్న ఈ వ్యాధికి నివారణ ఇంతవరకు లేదు. కరోనా వ్యాక్సిన్ అందుబాటులోకి రాలేదు. ఇప్పుడే దీనిపై ప్రయోగాలు చేస్తున్నారు. ఉన్న మందుల తోనే రక్షించే ప్రయత్నాలు సాగుతున్నాయి. వ్యాధిసోకిన వారి ముక్కు నుంచి, నోటి నుంచి తుమ్ము దగ్గుల ద్వారా వెలువడే తుంపర్లలోని సూక్ష్మభాగాలలో ఈ క్రిమి దాగి, మరొకరికి ప్రసారమవుతుంది. చేతుల మీద తిష్టవేసే సమయంలో కరచాలనంతో ఎదుటివారిచేతికి చేరుతుంది, అదే చేతితో ముఖాన్ని ముట్టుకుంటే తన మీద కూడా దాడిచేస్తుంది. ఈ వ్యాధి ఎట్లా వస్తుంది, ఏమేమి జాగ్రత్తలు తీసుకోవాలి, ఏ దేశంలో దాని తీవ్రత ఎంత ఉన్నది అనే సమాచారం గత కొద్దిరోజులుగా కుప్పలుతెప్పలుగా వస్తున్నది. వాటిలో కొన్ని అబద్దాలు, కొన్ని నిజాలు, మరికొన్ని వక్రీకరణలు, దుష్ప్రచారాలు ఉన్నాయి. అందుకే సోషల్ మీడియాలో ప్రచారాలపై ఆధారపడకుండ ఆకేవలం ప్రభుత్వం చేస్తున్న ప్రచారాలపైనే నమ్మకం ఉంచి ముందుకు సాగాలి. వైరస్ మీద చేస్తున్నట్టే, ఫేక్‌వార్తల మీద కూడా యుద్ధం చేయవలసి వస్తున్నది. చైనాలో మొదలైన ఈ వైరస్ ఇప్పుడు ప్రపంచాన్ని కకావికలం చేసింది. విదేశాల నుంచి వచ్చే ప్రయాణీకులతో భారతదేశంలో మొదట వ్యక్తమైన ఈ వ్యాధికారక వైరస్ ఇప్పుడు విదేశాల నుంచి వచ్చినవారి కుటుంబీకులకు, సన్నిహితులకు కూడా సోకడం మొదలైంది. సమూహంలో విస్తృతంగా వ్యాపించే దశను మూడో దశ అనీ, ఆ దశలోకి భారతదేశం ప్రవేశించకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రప్రయత్నాలు చేస్తున్నాయి. ఆ దశలోకి ప్రవేశించడం అంటూ జరిగితే, దానంత దుస్థితి భారతదేశానికి మరొకటి ఉండదన్న హెచ్చరికలు ఉన్నాయి. రెండోదశలో ఉన్న దశలో ఇప్పుడు దానిని అదుపు చేసేందుకు తీవ్రంగా కృషి జరుగుతోంది. దేశమంతా వ్యాపించిన ఈ దశలో నివారణకు మాత్రమే మార్గాలు ఉన్నాయి. మార్చి మాసారంభం నుంచి మనదేశంలో కరోనా ప్రకంపనలు తీవ్రంగా మొదలయ్యాయి. జాతీయ స్థాయిలో ప్రభుత్వం స్పందించి, ప్రధానమంత్రి మోడీ జాతిని ఉద్దేశించి ప్రసంగించడం మొదలు అనేక చర్యలు తీసుకున్నారు. ప్రధాని మోదీ సందేశంతో, జనతా కర్ఫ్యూ పిలుపుతో కరోనా వ్యతిరేక ప్రచారం ఉద్యమస్థాయికి చేరింది. ఇప్పుడు లాక్‌డౌన్ కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా కరోనా కట్టడికి ప్రధాని మోడీ ముందుండి నడిపిస్తున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్, ఎపి సిఎం జగన్‌లు కూడా ముందుండి తమ ప్రజలను రక్షించేందుకు కార్యాచరణకు దిగారు. దీంతో వ్యాధి వ్యాప్తి జరుగుతోంది. తొలిదశలో కేవలం ఆరోగ్యశాఖ యంత్రాంగమే కరోనా జాగ్రత్తలు తీసుకుంటు న్నప్పుడు, క్షేత్రస్థాయిలో విదేశాలకు వెళ్లివచ్చినవారి సమాచారసేకరణ వంటి కీలకచర్యలు చేపట్టారు. అయితే ప్రధానమంత్రి అంతగా చెప్పినా, ముఖ్యమంత్రులు బతిమాలి చెబుతున్నా, ప్రజల నుంచి స్వచ్ఛంద గృహ నిర్బంధానికి పూర్తి మద్దతు దొరకడం లేదు. ఈ అంశంపై ప్రధాని సోమవారం ఉదయం అసహనం ప్రకటించారు. చివరకు పోలీసులు రంగంలోకి దిగి ప్రజలను కట్టడి చేస్తున్నారు. రోడ్లపైకి ప్రజలు రాకుండా కఠినంగా వ్యవహరి స్తున్నారు. అందువల్ల అటు వైద్యులు, ఇటు పోలీసులు కృషిని అభినందిస్తూ వారికి మద్దతుగా మనమంతా ఇళ్లకే పరిమితం అయితే మంచిది. వైద్యులు, పోలీసుల కృషికి అండగా నిలుద్దాం.

ఎపి భవన్‌లో పటిష్ట భద్రతా చర్యలు

ఉద్యోగులకు సెలవులు :రెసిడెంట్ కమిషనర్

న్యూఢిల్లీ,మార్చి24(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వ్యాధి నిర్మూలనకు సంబంధించిన పటిష్ట భద్రతా చర్యలలో భాగంగా ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ మూతపడింది. మార్చి 31వ తేదీ వరకు కార్యాలయాలు మూసేతస్తూ ఉద్యోగులకు సెలవులు ఇస్తూ ఆదేశాలను జారీచేశారు. ఎపి భవన్‌లోని ఉద్యోగుల సంక్షేమార్థం రెసిడెంట్ కమిషనర్ భావన సక్సేనా ఈ మేరకు ఆదేవాలు జారీచేసింది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ భవన్ లోని కార్యాలయాలను మార్చ్ 31వ తేదీవరకు తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు, ఇందులోని ఉద్యోగులు తమ తమ ఇండ్లనుంచే కార్యాలయమునకు సంభందించిన రోజువారీ కార్యక్రమాలను చేయవలసి ఉంటుందని తెలిపారు. వీరందరూ టెలిఫోన్లలో, వాట్సాప్, ఈ మైల్స్ ద్వారా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎపి భవన్ కు దూరంగా వున్న 60 ఏళ్ళు వయస్సు పైబడిన కాంట్రాక్టు ఉద్యోగులందరూ కూడా వారి ఇళ్లనుంచి పనిచేయాలని చెప్పారు. అవసరమైనమేర సిబ్బందితో రొటేషన్ పద్ధతిలో పనిచేయవలసి వుంటుందని ఆదేశించారు. భవన్‌లోని అతిధుల గృహాలను, లిఫ్టులను, భవన్ పరిసర ప్రాంతాలను, ఉద్యోగులు నివాసముంటున్న భవన్ పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రత్యేకంగా నియమించిన పారిశుభ్ర కార్మికులతో శుభ్రం చేయించవలసినదిగా భవన్ హౌస్ కీపింగ్ అధికారులను భావన సక్సేనా ఆదేశించారు. భవన్ లో నివాసముంటున్న డ్రైవర్లను అవసరమైనప్పుడు తక్షణమే విధులకు హాజరగునట్లు తగిన జాగ్రత్తలు తీసుకోవలసిందిగా ప్రోటోకాల్ విభాగ అసిస్టెంట్ కమిషనర్ ను ఆదేశించారు. భవన్ లో శానిటైజర్స్, మాస్కులు, సబ్బులు అవసరమైనంతమేర అందరికి అందుబాటులో వుంచవలసినదిగా ఎపి భవన్ రెసిడెంట్ కమిషనర్ ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ భవన్ కు వచ్చే అతిధులను, భవన్ సిబ్బందిని థర్మోమీటర్స్ తో తగిన పరీక్ష చేయడానికి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డా. రమాదేవిని అవసరమైన చర్యలు తీసుకోవలసిందిగా ఆదేశించారు. భవన్ లోకి ఇతరులు ఎవరూ రాకుండా తగిన కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవలసిందిగా డి ఎస్ పి.ని ఆదేశించారు.భవన్ లోని క్యాంటీన్ కార్మికులు ప్రస్తుతం ఎవరైతే వున్నారో వారందరికీ తగిన జాగ్రత్తలు తీసుకోవలసిందిగా క్యాంటీన్ మేనేజర్‌ను రెసిడెంట్ కమిషనర్ ఆదేశించారు.

గిరిజన గ్రామాల్లో ప్రచారం ఉధృతి

వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు స్వీయ నియంత్రణ
ప్రజలను అప్రమత్తం చేస్తున్న వైద్య సిబ్బంది

భద్రాద్రి కొత్తగూడెం,వ మార్చి24(ఆంఎన్ఎ): జిల్లావైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది గ్రామ గ్రామానికి వెళ్లి ప్రజలకు నివారణపై అవగాహన కల్పిస్తున్నారు.. ప్రజాప్రతినిధులు గిరిజన గూడేలకు వెళ్లి అప్రమత్తం చేస్తున్నారు.. సమష్టి బాధ్యతగా భావించి ప్రతిఒక్కరూ కరోనా నివారణకు పాటుపడాల్సిన సమయమిదని తెలియచేస్తున్నారు. జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల ద్వారా జిల్లాలోకి ప్రవేశించే ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. చెక్‌పోస్టు ఎక్కువ ఏర్పాటు, విధులు నిర్వహించే అధికారుల సమగ్ర వివరాలను అందజేయాలని రవాణ శాఖాధికారులకు సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు స్వీయ నియంత్రణ కరోనా వ్యాప్తిని అరికట్టవచ్చని సూచిస్తున్నారు. రోనా వ్యాధి బారిన పడకుండా ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు స్వీయ నియంత్రణ పాటించాలని గిరిజనానికి సూచిస్తున్నారు. సిఎం కెసిఆర్ ఆదేశాలతో కలెక్టరు జిల్లాస్థాయి, మండల స్థాయి, గ్రామస్థాయి కమిటీలను నియమించారు. గ్రామస్థాయిలో ఇతర దేశాల నుంచి వచ్చిన వ్యక్తుల సమాచారం తక్షణం తెలుసుకునేందుకు కమిటీలు ఎంతగానో ఉపయోగప డున్నాయి. కలెక్టర్ స్వయంగా రైతు మార్కెట్, హోటల్, వార్డులను తనిఖీ చేసి కరోనా వ్యాప్తి చెందకుండా ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలను స్వయంగా వివరిస్తున్నారు. ముందస్తు జాగ్రత్తగా భద్రాచలం, కొత్తగూడెం ఆస్పత్రుల్లో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేయించా రు. పాఠశాలలు, సినిమా హాళ్లు, పార్కులు, మద్యం దుకాణాలు మూసివేయించారు. ఈ నెలాఖరునాటికి నిర్ణయించే వివాహాలకు నిర్ణీత సంఖ్యలో మాత్రమే ప్రజలు రావాలని నిఘా ఏర్పాటు చేయించాలని రెవెన్యూ, పోలీస్ అధికారులకు సూచిం చారు. వివాహాలు చేసేందుకు ముహూ ర్తాలు పెట్టుకొని ఫంక్షన్‌హాల్‌ను బుక్ చేసుకున్నా ఎక్కువ సంఖ్యలో ప్రజలను రానివ్వొద్దని నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాలను ధిక్కరించి అధిక సంఖ్యలో ప్రజలు వస్తే అటువంటి ఫంక్షన్ హాళ్లను తక్షణం మూసివేయాలని అధికారులను ఆదేశించారు. కరోనా మహమ్మారిని కట్టడి చేసి ప్రజల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకుంటున్నామని, ఉత్తర్వులను ధిక్కరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. హోటళ్లలో మగ్గుల ద్వారా మంచినీటి సరఫరా చేయకుండా బాటిళ్ల ద్వారా సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేశారు. వీధుల్లో టిఫిన్ తదితర బండ్లు ఏర్పాటు చేసి విక్రయాలు నిర్వహిస్తున్న వారు తప్పనిసరిగా పరిశుభ్రమైన మంచినీరు ఏర్పాటుతో పాటు సబ్బును కూడా అందుబాటులో ఉంచాలని చెప్పారు. మున్సిపల్, పంచాయతీ అధికారులు తనిఖీలు నిర్వహించి రక్షణ చర్యలు తీసుకోని యజమానులకు జరిమానా విధించడంతో పాటు పరిస్థితి పునరావృతం అయితే సీజ్ చేయాలని చెప్పారు. ప్రజలు ఇంటికి సరిపడా నిత్యావసర సరుకులు, కూరగాయల లాంటివి పదిహేను రోజులకు సరిపోను ఒకేసారి కొనుగోలు చేసి భద్రపర్చుకోవాలన్నారు. రానున్న 15 రోజులు ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం, అధికారులు చేస్తున్న సలహాలు, సూచనలు పాటించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలు ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. వైద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయించారు. వ్యాధి నియంత్రణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. వ్యాధి ఉన్న వ్యక్తులు తుమ్మినా, దగ్గినా రుమాలు, దస్తీని అడ్డుపెట్టుకోవాలని చెప్పారు. చేతులను సబ్బు లేదా శానిటైజర్లతో రెండు నిమిషాలు పాటు పరిశుభ్రంగా తరచూ శుభ్రం చేస్తూ ఉండాలని, చేతులు కడుగకుండా నోరు, ముక్కు, కళ్లను తాకొద్దన్నారు.

విదేశాల నుంచి వచ్చిన వారికి స్క్రీన్ టెస్ట్ చేస్తున్న వైద్యాధికారులు

కరోనాను ఎదుర్కొనే సత్తా భారత్‌కు ఉంది

గతానుభవాలే ఇందుకు నిదర్శనం
పప్రపంచారోగ్య సంస్థ కితాబు

జెనీవా,మార్చి24(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వ్యాప్తిని ఎదుర్కోవటానికి భారతదేశానికి అద్భుతమైన సామర్థ్యం ఉందంటూ భారతీయులకు ప్రపంచ ఆరోగ్య సంస్థ శుభవార్త చెప్పింది. మహమ్మారి కోవిడ్-19 తో వణికిపోతున్న దశలో భారీ ఊరటనిచ్చే కబురు చెప్పింది. ముఖ్యంగా స్మాల్-పాక్స్, పోలియో లాంటి రెండు మహమ్మారులను విజయవంతంగా తరిమికొట్టిన అద్భుతమైన అనుభవం ఉన్న భారత్ కరోనాను కూడా నిర్మూలించ కలుగుతుందని డబ్ల్యూహెచ్ఓ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైఖేల్ జె ర్యాన్ మంగళవారం చెప్పారు. జనసాంద్రత ఎక్కువగా వున్న భారతదేశంలో ఈ వైరస్ ఎక్కువ కాలంవుండే అవకాశం వుంటుందన్నారు. రెండు మహమ్మారిని నిర్మూలించడంలో భారతదేశం ప్రపంచాన్ని నడిపించింది, కాబట్టి భారతదేశానికి ప్రస్తుత పరిస్థితిని ఎదుర్కొనే సత్తా, సామర్థ్యం ఉందన్నారు. అయితే పెద్ద సంఖ్యలో ల్యాబ్‌లు చాలా అవసరమని పేర్కొంది. కోవిడ్-19 మహమ్మారిపై నిర్వహించే రోజువారీ విలేకరుల సమావేశంలోజె ర్యాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. సులభమైన పరిష్కారాలు లేనప్పటికీ భారత్ లాంటి దేశాలు ఇంతకుముందు చేసినట్లుగా ప్రపంచానికి మార్గం చూపించడం చాలా ముఖ్యమైందని ఆయన అన్నారు.

కాగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రకారం ప్రపంచవ్యాప్తంగా కేసుల సంఖ్య 3,30,000 దాటింది, మరణాల సంఖ్య 14వేలు దాటింది. అయితే కరోనా వ్యాప్తిలో ప్రభుత్వం తీసుకుంటున్న జాగ్రత్తలను, రక్షణ సూచలను ప్రతీ పౌరుడు తప్పకుండా పాటించాల్సిన అవసరం ఎంతైనా వుందని నిపుణులు సూచిస్తున్నారు. వేగంగా విస్తురిస్తున్న కరోనాకు చెక్ పెట్టే చర్యల్లో భాగంగా అమలు చేస్తున్న లాక్‌డౌన్‌ను సీరియస్‌గా తీసుకొని విధిగా ఆచరించాలని గుర్తు చేస్తున్నారు.

టోక్యో ఒలింపిక్స్ నిర్వహణ అసాధ్యమే

జులై 24న ఆరంభం కావని వెల్లడించిన ఐఓసీ సభ్యుడు

న్యూఢిల్లీ,మార్చి24(ఆర్ఎన్ఎ): ఈ ఏడాది నిర్వహించే టోక్యో ఒలింపిక్స్‌ను వాయిదా వేయాలని అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీ నిర్ణయానికి వచ్చినట్లు ఐఓసీ సభ్యుడు డిక్‌పౌండ్ స్పష్టం చేశారు. తిరిగి ఎప్పుడు నిర్వహిస్తారనేదానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. బహుశా 2021లో నిర్వహించే అవకాశాలున్నాయని అభిప్రాయపడ్డారు. ఒలింపిక్స్ వాయిదా, అందుకు తగ్గ ఏర్పాట్లు, కార్యాచరణపై త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ కారణంగా ఇప్పటికే అనేక దేశాలు, అథ్లెట్లు, క్రీడా సమాఖ్యలు ఈవెంట్‌ను వాయిదా వేయాలని అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీ(ఐఓసీ)ని కోరాయి. అయినా, అవేమీ పట్టించుకోకుండా క్రీడలను యథావిధిగా నిర్వహిస్తామని ఐఓసీ, జపాన్ ఒలింపిక్స్ ప్రతినిధులు ఇన్ని రోజులు చెప్పుకుంటూ వచ్చారు. కెనడా ఒలింపిక్స్ కమిటి ఒకడుగు ముందుకేసి జులై 24న టోక్యో ఒలింపిక్స్ నిర్వహిస్తే తమ అథ్లెట్లను పంపించబోమని తేల్చి చెప్పింది. కొద్ది గంటలకే ఆస్ట్రేలియా సైతం ఇదే విషయాన్ని ప్రకటించింది. ఇక ప్రపంచ అథ్లెటిక్స్ అధిపతి స్టెబాస్టియన్ కొ.. ఒలింపిక్స్‌ను వాయిదా వేయాలని ఐఓసీకి లేఖ రాశారు. దీంతో ఒలింపిక్స్ గవర్నింగ్ బాడీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఐఓసీ అధ్యక్షుడు థామస్ బాక్ సోమవారం మాట్లాడుతూ టోక్యో ఒలింపిక్స్‌ను రద్దు చేసే ఆలోచన లేదని, వాయిదా వేయాలని భావిస్తున్నామని చెప్పారు. నాలుగు వారాల్లో ఈ విషయంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మరోవైపు జపాన్ ప్రధాని షింజో ఏబ్ సైతం పార్లమెంట్‌లో ఇదే విషయాన్ని ప్రకటించారు. ఒలింపిక్స్‌ను వాయిదా వేసే నిర్ణయం తీసుకోక తప్పకపోవచ్చని పేర్కొన్నారు.

విదేశాల నుంచి వచ్చిన వారికి పరీక్షలు

ఇంట్లోనే ఉండాలని అధికారుల ఆదేశాలు

ఆదిలాబాద్,మార్చి24(ఆర్ఎన్ఎ): విదేశాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన ఇద్దరు కార్మికులకు ఇంద్రవెల్లి పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆదివారం ఎస్సై గంగారామ్, వైద్యుడు శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఏమాయికుంట గ్రామానికి చెందిన పవార్ ప్రేమ్‌సింగ్, అందునాయక్‌తండా గ్రామానికి చెందిన జగదీశ్ కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరు చేస్తున్న పనులు ముగియడంతో వారిని యాజమాన్యం సెలవులు ప్రకటించింది. దీంతో తమ స్వగ్రామాలకు వచ్చారు. విషయాన్ని తెలుసుకున్న ఎస్సై గంగారామ్ ఏమాయికుంట సర్పంచ్ జాదవ్ లఖన్‌సింగ్ సహకారంతో ఇద్దరినీ మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించి వైద్యుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. వారికి వ్యాధులు లేవని వారు ఆరోగ్యంగానే ఉన్నారని, ముందు జాగ్రత చర్యగా 15 రోజులు ఇంట్లోనే ఉండాలని, బంధువులతోపాటు ఇంటి చుట్టుపక్కల వారి ఇండ్లలకు పోవద్దని సుచించామన్నారు. మండలంలోని దనోరా(బి) గ్రామానికి చెందిన ఓంప్రకాశ్, జయదీప్ వారి సొంత పనుల నిమిత్తం మహారాష్ట్రకు పోయివచ్చారన్నారు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు వారిద్దరిని కూడా ప్రభుత్వ దవాఖానకు తరలించి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. వారిద్దరూ ఆరోగ్యంగానే ఉన్నారన్నారు. కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేస్తున్న ఎమ్మెల్యేలు

వ్యాధి సంక్రమించకుండా జాగ్రత్తలు పాటించలాని
వినతి

భద్రాద్రి కొత్తగూడెం,మార్చి24(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యేలు కూడా రంగంలోకి దిగారు సిఎం కెసిఆర్ ఆదేశాలతో పలు చోట్ల వారు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ అన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కరపత్రాలు అందించి సూచించారు. గ్రామాల్లో ప్రతిఒక్కరు

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. గిరిజన మహిళలతో మాట్లాడుతూ వారికి అర్థమయ్యేలా అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండి కరోనా వైరస్‌ను తరిమివేయాలని సూచించారు.అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. కరోనా వైరస్ వ్యాప్తిపై ఎవరూ భయపడొద్దని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. కరోనాపై సీఎం కేసీఆర్ అందరినీ అప్రమత్తం చేశారని, ఎలాంటి అపోహలు నమ్మవద్దని అన్నారు. ఇతర దేశాల నుంచి వచ్చిన వారి నుంచి ఈ వైరస్ వచ్చిందని, వారిని గుర్తించి అధికారులకు సమాచారం అందించాలన్నారు. షేక్‌హ్యాండ్ ద్వారా ఒకరి నుంచి ఒకరికి కరోనా ప్రబలే అవకాశం ఉన్నందున నమస్కారం చేయడమే ఉత్తమం. రెండు చేతులు జోడించి నమస్కారం చేయడంతో కరోనా విదేశీయులు చేసే కరచాలనం కంటే నమస్కారమే శ్రేయస్కరమైందని డాక్టర్లు సైతం చెప్తున్నారు. తప్పనిసరిగా కాళ్లు, చేతులు శుభ్రం చేసుకొని ఇంట్లోకి రావాలన్నారు. జలుబు, దగ్గుతో బాధపడుతున్న వ్యక్తి స్వీయ నియంత్రణ పాటించి మరొకరికి ప్రబలకుండా చూడాలన్నారు.

ఏసిలో పదో తరగతి పరీక్షలు వాయిదా

ప్రకటించిన మంత్రి సురేశ్

అమరావతి,మార్చి24(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి పరీక్షలు వాయిదా పడ్డాయి. మార్చి 31 నుంచి జరగాల్సిన పదో తరగతి పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రకటించారు. రెండు వారాలపాటు పరీక్షలు వాయిదా వేయనున్నట్టు ఆయన తెలిపారు. మార్చి 31 తర్వాత పరిస్థితులను సమీక్షించి కొత్త తేదీలు ప్రకటిస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం కరోనా కట్టడిపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష అనంతరం విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. కరోనా వ్యాపి నిరోధక చర్యల్లో భాగంగా ప్రస్తుతం రాష్ట్రంలో లాక్‌డౌన్ కొనసాగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా తెలుస్తోంది.రాష్ట్రంలో లాక్‌డౌన్ నేపథ్యంలో ఎంసెట్, ఈసెట్, ఐసెట్ ప్రవేశ పరీక్షల దరఖాస్తు గడువును పొడిగిస్తున్నట్టు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. విద్యార్థులకు ఇబ్బంది పడకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. మార్చి 29 వరకు ఉన్న ఎంసెట్ దరఖాస్తు గడువును ఏప్రిల్ 5కు పొడిగించారు. అలాగే ఏప్రిల్ 2వరకు ఉన్న ఈసెట్, ఐసెట్ ప్రవేశ పరీక్షల గడువును ఏప్రిల్ 9వరకు పొడిగించారు.

బయటకు రాకుండా పోలీసుల కట్టడి

అనేక గ్రామాల్లో ముళ్లకంచెలతో దారులు మూసివేత

కరీంనగర్,మార్చి24(నేటినిజం ప్రతినిధి): ప్రయాణాలు మానుకోండి...ఇల్లు వది ఎక్కడికీ వెళ్లకండి అంటూ పోలీసులు వేడుకుంటున్నారు. అమ్మా.. చెల్లీ... అన్నా దండం పెట్టి చెబుతున్నాం... ప్రయాణాలు చేయకండి....ఇళ్ళకే పరిమితం కండి... కరోనా వైరస్ నివారణకు సహకరించండంటూ వాహనదారులను వేడుకున్నారు ట్రాఫిక్ పోలీసులు. మనలో ఉందో లేదో ఎలా వస్తుందో కూడా చెప్పలేం, ఇంటిల్లిపాది, గ్రామం, దేశం సురక్షంగా ఉండాలంటే సహకరించండంటూ ఇలా రోడ్లపై తిరిగితే వైరస్‌ను కట్టడి చేయలేమని కోరారు. పెద్దపల్లి కమాన్ చౌరస్తా వద్ద సోమవారం రాజీవ్ రహదారిపై వచ్చి పోయే ప్రయాణికులకు ఇలా మూకుమ్మడిగా దండాలు పెడుతూ వినూత్న కౌనెల్సింగ్ నిర్వహించారు పెద్దపల్లి ట్రాఫిక్ సిబ్బంది. ఇకపోతే పలు గ్రామాల ప్రజలు తమకుతాముగా ముళ్ల కంచెలు వేసుకున్నారు. కరోనా నివారణ కోసంరాష్ట్ర ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించిన నేపథ్యంలో రంగారెడ ÷-డి జిల్లాలోని కందుకూరు మండలం గుమ్మడవెల్లి గ్రామంలోకి రాకపోకలను గ్రామస్తులు నిలిపివేశారు. రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంచెలు వేసి వాహనాలను నిలిపివేశారు. అయితే ఈ ఒక్క రోడ్డే శ్రీశైలం హైవే నుంచి సాగర్ హైవేకు వెళ్లే లింక్ రోడ్డు కావడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. మహారాష్ట్రలో రోజురోజుకూ కరోనా విజృంభిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నిర్మల్ జిల్లా తానూర్ మండలం హిప్నెల్లీ గ్రామవాసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. తమ గ్రామంలోకి మహారాష్ట్ర వారు ఎవరూ రాకూడదని గ్రామ పంచాయతీ తీర్మానం చేసింది. గ్రామానికి వచ్చే రెండు రహదారులకు అడ్డుగా కట్టెలు వేసి బయటవారినెవ్వరినీ గ్రామంలోకి రానివ్వకుండా ప్రజలు అడ్డుకుంటున్నారు.

వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే హైడ్రాక్సీ క్లోరోక్విన్ వాడాలి

వ్యాధి సోకకుండానే ఈ మాత్రలు వాడరాదు
ఆంధ్రప్రదేశ్ వై

శార్వరి విశేషాలు తెలుసుకునే అవకాశం ఏది?

పంచాంగం చదువుకని తెలుసుకోవాల్సిందే

హైదరాబాద్,మార్చి24(ఆర్ఎన్ఎ): ఉగాది అంటేనే రానున్నకాలానికి విషయాలు తెలుసుకునే అవకావం ఉంటుంది. కాలచక్ర పరిభ్రమణం ఆధారంగా నవనాయకుల నిర్ణయం జరుగుతుంది. ఆ విశేషాలను జ్యోతిషశాస్త్రం తెలియజేస్తుంది. ప్రతి సంవత్సరానికీ రాజు, మంత్రి, సేనాధిపతి, సస్యాధిపతి, ధాన్యాధిపతి, అర్ఘాధిపతి, మేఘాధిపతి, రసాధిపతి, నీరసాధిపతి అని తొమ్మిదిమంది నాయకులు ఉంటారు. వీరినే నవనాయకులు అంటారు. సంవత్సరాది ఏ వారం వస్తుందో.. ఆ వారానికి అధిపతిని రాజుగా నిర్ణయిస్తారు. శార్వరినామ సంవత్సరం బుధవారం నాడు వస్తోంది. సూర్యుడు మేషరాశిలోకి సంక్రమించే వారాన్ని బట్టి మంత్రిని, సింహరాశిలోకి ప్రవేశించే వారం ఆధారంగా సేనాధిపతిని, కర్కాటక సంక్రమణం చేసే వారాన్ని బట్టి సస్యాధిపతిని, ధనూరాశిలోకి వచ్చే వారం ఆధారంగా ధాన్యాధిపతిని, మిథున సంక్రమణ జరిగే వారాధిపతిని అర్ఘాధిపతిగా, తులలో ప్రవేశించే రోజును బట్టి రసాధిపతిని, మకరరాశిలో ప్రవేశించే వారం ఆధారంగా నీరసాధిపతిని.. ఇలా నవనాయకులను నిర్ణయిస్తారు. సూర్యుడు.. ఆరుద్ర నక్షత్రంలోకి ప్రవేశించే వారం అధిపతి ఆధారంగా మేఘాధిపతిని నిర్ణయిస్తారు. నవనాయకులను బట్టి.. సంవత్సర ఫలితాలను అంచనా వేస్తారు పంచాగ కర్తలు. రాజు, మంత్రి, సేనాధిపతి పరిపాలనను నిర్ణయిస్తారు. సస్యాధిపతిని బట్టి వర్షపాతం, ధాన్యాధిపతిని బట్టి ధాన్యవృద్ధి, అర్ఘాధిపతిని ఆధారంగా నవ్వులు, మినుములు మొదలైన వాటి దిగుబడి, మేఘాధిపతి ఆధారంగా వర్షాలు, పంటలు ధరలు, రసాధిపతిని బట్టి పులుపు, చేదు మొదలైన పదార్థాల ధరల హెచ్చుతగ్గులు నిర్ణయిస్తారు. ఇక ఇళ్లలో కూడా పంచాంగానికి పూజలు చేయడం కూడా ఆనవాయితీగానే వస్తోంది. చంద్రుడి నక్షత్ర యోగాన్ని అనుసరించి చాంద్రమానం, సూర్య సంక్రమణాల ప్రకారం సౌరమానం, గురూదయాన్ని ఆధారంగా చేసుకొని బార్హస్పత్య మానం లెక్కిస్తారు. ఎవరి పరంపరాగతమైన, ప్రాంతానుసార మాన్నాలు వారికి ప్రమాణాలు. ఇందులో వైరుధ్యాలేమీ లేవు. గణనలో విభిన్నత్వం ఉన్నా ఫలాల్లో, పంచాంగాల పద్ధతుల్లో పెద్దగా భేదమేదీ ఉండదు. ఈ పండగ రోజంతా కొత్త వాతావరణం స్ఫురిస్తూ ఉంటుంది. నూతనశోభ సర్వత్రా వెల్లి విరుస్తుంది. ప్రకృతిలోని చెట్టు, పుట్ట అంతా ఆనందమయంగా, ఆహ్లాదకరంగా కనిపిస్తుంది. అలాంటి శుభవేళ మానవాళి అంతా ప్రకృతి పులకింతకు అనుగుణంగా మధురాభూతులను పరస్పరం పంచు కోవాలన్న ఓ మహత్తర సమసమాజ స్థాపన లక్ష్యం ఉగాది పండగ వెనుక దాగి ఉంది. అయితే ఈ యేడు కరోనాతో ఈ శార్వరి విశేషాలు తెలుసుకునే అవకాశం లేకుండ ఆపోయింది.

ఉగాది పచ్చడిలో ఔషధ గుణాలు

శరీరావయాలకు అనుగుణంగా పదార్థాలు ప్రతి ఒక్కరూ సేవించాలని పండితలు సూచనలు

హైదరాబాద్,మార్చి24(ఆర్ఎన్ఎ): ఉగాది అనగానే పచ్చడి గుర్తుకు రావటం అతి సహజం. ఈ పచ్చడిలో ఉండే షడ్రుచులు కోరుకోని వారు ఉండరు. అలాగే ఔషధ గుణాలూ ఉన్నాయి. కరోనా నేపథ్యంలో ప్రతి ఒక్కరూ విధిగా ఉగాది పచ్చడి సేవించాలని పండితులు సూచిస్తున్నారు. దీని సేవనం వల్ల ఆరోగ్యం కుదుట పడుతుందని, రోగనిరోధక శక్తి పెరుగుతుందని అంటున్నారు. అంటే కష్టం వచ్చినా, సుఖం వచ్చినా సమానంగా స్వీకరించాలనే చక్కటి సూచన చేస్తూ మన పెద్దలు ఈ పచ్చడిని ప్రసాదంగా స్వీకరించే అలవాటును పెట్టారు. ఉగాది పచ్చడిలో ఉపయోగించే పదార్థాలన్నీ ఆరోగ్య పరిరక్షణకు ఉపయుక్తమయ్యే దివ్య ఔషధాలేనని అన్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే సూక్ష్మ క్రిములను సంహరించే శక్తి వేపపూతకి ఉందని అందరికీ తెలిసిన విషయమే. ఉగాది ఆరోగ్యకరమైన పండగానే చెప్పుకోవాలి. ఉగాది రోజు మనం తినే ఆహారంలో షడ్రుచులు ఉంటాయి. వీటిలో ఏది లేకున్నా ఉగాది పచ్చడి సంపూర్ణం కాదు. ఆరోగ్యం పరిపుష్టం కోసమే ఇలా పెట్టారని పెద్దలు ఏనాడో చెప్పారు. మనశరీరం ఓ పద్ధతి ప్రకారం నిర్మితమై ఉంటుంది. అందుకే ఈ రుచులను సమపాళ్లల్లో ఎల్లవేళలా తీసుకోవచ్చు. అయితే ఉగాది రోజు వీటన్నిటిని మిశ్రనమంగా పచ్చడి చేసుకుని తీసుకోడం ఆచారంగా వస్తోంది. ఉగాది రోజు చేసుకునే వంటకాలు, పచ్చడి వెనక ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి. ఉగాది రోజున చేసే ఉగాది పచ్చడిలో అన్నీ ఆరోగ్య లక్షణాల కలగలుపుగా చెప్పుకోవాలి. తీపి, చేదు, వగరు, ఉప్పు, కారం, పులుపుల మేళవింపుతో చేసే ఈ పచ్చడి అందించే రుచుల్లో దాగివున్న ఆరోగ్య రహస్యాలు ఉన్నాయని వైద్యులు సూత్రీకరిస్తారు. ఈ పచ్చడి కోసం నోరూరని తెలుగువారు ఉండరు. ఆయుర్వేదం ప్రకారం షడ్రుచులు మధుర, ఆమ్ల, లవణ, ఉప్పు, కటు, తిక్త రసాలు. మధుర రసం అంటే తీపి కూడా శరీరానికి అవసరం. ఇది వాతాన్ని తగ్గిస్తుంది, అవయవాలకు శక్తినిస్తుంది. శరీరానికి బలం, వర్ణం ఇస్తుంది. పైత్యం, దప్పికలను తగ్గిస్తుంది. చర్మానికి, కంఠానికి మృదుత్వాన్నిస్తుంది. దీన్ని ఎక్కువగా తీసుకుంటే శరీరంలో కొవ్వు తద్వారా బరువును పెంచుతుంది. అధిక నిద్రకు దారితీస్తుంది. చర్మ సమస్యలు, క్రిములు పెరుగుతాయి. కఫాన్ని పెంచుతుంది. ఆమ్ల రసం అంటే పులుపు నోటిలో లాలాజలాన్ని పెంచుతుంది. ఆహారానికి రుచిని, శరీర పుష్టిని ఇస్తుంది. వాత, కఫాలను తగ్గిస్తుంది. శరీర బరువును నియంత్రిస్తుంది. మానసికోల్లాసాన్ని ఇస్తుంది. లవణ రసం చాలా తక్కువ ప్రమాణంలో తీసుకోవాలి. కణజాల పనితీరుకు లవణం అవసరం. జ్వరం, వడదెబ్బలు రాకుండా నివారిస్తుంది. వచ్చినప్పుడు లవణరసం ఉన్న పదార్థాలను తీసుకుంటే నీటిశాతం సమతుల్యం అవుతుంది. ఆహారం త్వరగా అరిగేటట్లు చేస్తుంది. విసర్జన సక్రమంగా ఉండేట్లు చేస్తుంది. దీన్ని మోతాదు మించి తీసుకుంటే గుండె, కిడ్నీలకు ప్రమాదం. ఉప్పు కఫాన్ని బయటకు పంపుతుంది. ఎక్కువైతే చర్మం, వెంట్రుకలు, దంతాలకు హాని చేస్తుంది. కారం శరీరంలోని కణాలను ఉద్రేకపరిచి, వేడిని పెంచుతుంది. మంటను పుట్టిస్తుంది. నోటిని పొడిబారేలా చేస్తుంది. ముక్కు, కళ్ల నుంచి స్రావాలను పుట్టిస్తుంది. అలసట, వాపు, శరీర వృద్ధిని తగ్గిస్తుంది. చెమటను శరీరంలోని కఫాన్ని తగ్గిస్తుంది. అధికంగా తీసుకుంటే వాపు, మంట, పోటును కలిగిస్తుంది. శుక్రహరం, దౌర్బల్యం. శరీర కాంతి తగ్గుతుంది. అందుకే కారం మితంగా వాడాలంటారు. చేదు ప్రధానంగా షుగర్‌ను కంట్రోల్ చేస్తుంది. ఇది మనసు, నాలుకలకు అయిష్టతను కలిగించినప్పటికీ శరీరానికి మేలు చేస్తుంది. నాలుకకు రుచిని పుట్టిస్తుంది. కాలేయ పనితీరును మెరుగుపరుస్తుంది. చర్మవ్యాధులను నివారిస్తుంది. గ్రంథుల స్రావాలను పెంచుతుంది. ఒక్కో అంగం లేదా అవయవం పనిచేయలంటే దానికి తగ్గట్లుగా అవసరమైన ఆహారాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. అందుకే పండగల రోజు అయినా వీటిని ఖచ్చితంగా ఇవ్వాలని పెద్దలు నిర్ణయించి పెట్టారు.

పండగలతో కొత్త ఉత్సాహం

కరోనా నేపథ్యంలో అంతా శాంతిగా ఉండాలి

హైదరాబాద్,మార్చి24(ఆర్ఎన్ఎ): భారతీయ సంప్రదాయంలో పండలకు విశిష్ట స్థానం ఉంది. ఒక్కో అవసరానికి అనుగుణంగా ఒక్కో పండగ ఉంటుంది. ఉగాది కూడా ఇందులో భాగంగానే చూడాలి. ఇక గతం గతః ఇప్పుడంతా కొత్తగా సాగుదామన్న ఆలోచనతో లేదా ఉత్సాహంతో ఉగాది మనకు శక్తిని ఇస్తుంది. పండగలకు లేదా కాలనికి అంత శక్తి ఉంది. కాలానికి ఎటువంటి గాయాలనైనా మాన్పగలిగే శక్తి ఉంది. అందుకే కాలం గడిచిన కొద్దీ పాత జ్ఞపకాలు పోయి కొత్త ఉత్సాహం నిండుతుంది. ఇలాంటి వాటి కోసమే పండగలు ఉన్నాయి. మనుషుల భావావేశాలకు సంబంధించిన విషయాల్లో గాయం, బాధ, దుఃఖాల నివారణ వారి జ్ఞాపకాలను బట్టి ఉంటుంది. నిజానికి కాలం పాత్ర ఇక్కడ పెద్దగా లేదనే అనిపిస్తుంది. వ్యక్తి ఆ బాధ నుంచి బయటపడాలి అనుకొని కూడా తగినంత దృష్టి పెట్టకపోతే, కాలం ఏమీ చేయలేదు. ఆలోచనల వల్ల, మానసిక స్థైర్యం వల్ల అన్నీ సాధ్యపడతాయి. ఇంద్రియాలు ఎంత త్వరగా కొత్త ఆలోచనల్ని గ్రహిస్తాయో, అంత త్వరగా పాత జ్ఞాపకాలు కనుమరుగవుతాయి. గాయం త్వరగా మానుతుంది. సంకల్పబలమే విజయానికి కారణమవుతుంది. క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొనే టప్పుడు, మనిషిలో నిరాశ చోటు చేసుకుంటూ ఉంటుంది. అటువంటప్పుడు, అసలు ఆ స్థితిని ఎదుర్కోగలమా అనే భయం, ఆందోళన కలుగుతాయి. పరిస్థితి ఎటువంటిదైనా, అది మనిషి ఎదుర్కోలేనంత పెద్దదేమీ కాదు. ఒక్కోసారి, కదలకుండా స్థిరంగా ఉండిపోయినట్లు కాలం భ్రాంతి కలిగిస్తుంది. అది కదిలి వెళ్లిన ప్రతిక్షణం, విజయం దిశగా పయనించే అవకాశాన్ని మనిషికి కల్పిస్తుంది. అవగాహనతో సమస్యను పరిష్కరించు కోవాలనే సంకల్పం అతడిలో దృఢంగా ఉంటే చాలు. అప్పుడు ఎంత జటిల సమస్యనైనా సులువుగా ఎదుర్కోగలిగే శక్తి మనిషికి ఏర్పడుతుంది! కొత్త జీవితాన్ని లేదా కొత్తగా వసంత వేళ నూతన ఆవిష్కరణలకు ఉగాదిని వేదికగా చేసుకుంటాం. ప్రకృతిలోని ప్రతి చర్యా కొన్ని సూత్రాలకు లోబడి ఉంటుంది. స్థిరపడటానికి కొంత సమయమూ అవసరమవుతుంది. ఎటువంటి సంఘర్షణైనా సద్దుమణగడానికి సమయం కావాలి. పాతగాయం మానడానికి కొంత సమయం పడుతుంది. గాయాల బాధలను అధిగమించి మనోధైర్యంతో సాగడానికి పండగలు, పూజలు, తిథి,వార,నక్షత్రాలు ఎంతగానో దోహదపడతాయి. మనలో కొత్త ఉత్సాహాన్ని నింపుతాయి. బాధల నుంచి బయటపడటానికి, మనిషికి తగిలిన గాయం మానడానికి ఎంతకాలం పడుతుందో ఎవరూ చెప్పలేరు. ప్రశాంతత లోపించినప్పుడు, సంతోషం దూరమైనప్పుడు మనిషి బాధపడటం సహజమే. తిరిగి ప్రశాంతత ఏర్పడి సంతోషం కలిగినప్పుడే మానసిక ఉల్లాసం ఉంటుంది. అందుకోసం పండగలు మబసకు బాగా తోడ్పడతాయి. అందుకే ఏ మతంలో లేనన్ని పండగలు ఆచారాలు మన హిందూ సంప్రదాయంలో ఉన్నాయి. దీనికి మానసిక అనుభవాలు, దైవశక్తి ఎంతగానో తోడ్పడతాయి. ఓ మనిషి జీవితకాలంలోని కొన్ని జ్ఞాపకాల కూర్పు. కొత్త జ్ఞాపకాలు పాతవాటిని వెనక్కి తోస్తుంటాయి. అప్పుడు చూస్తే, ఆ పాతజ్ఞాపకాలు మరో కోణంలో తక్కువ తీవ్రతతో కనపడతాయి. కొత్త అనుభవాల ప్రభావం ఆ గాయం మాన్పే ప్రక్రియను వేగవంతం చేస్తుంది. అయినా కాలం గాయాన్ని మాన్పుతుందని చెప్పుకోవడానికి పండగలతో ఆనందాన్ని ఆస్వాదిస్తాం. అవన్నీ కూడా పండగలు, ఆచారాలు, పూజలతో కలుగుతుంది. మనిషిని ఎప్పటికప్పుడు కొత్తశక్తితో ముందుకు తీసుకుని వెళ్లగల చోదకం పండగలదే. ఉగాది కూడా అందులో భాగంగానే భావించాలి. షడ్రుచుల పచ్చడి, భక్ష్యం, పులిహోర ఇలా విభిన్న రుచులతో మన పాత గాయాలను మరచి పండగ చేసుకుంటాం. ఉగాది బాగా జరిగిందన్న భావనే మనలను ముందుకు నడిపిస్తుందన్న ఆశతో సాగుతాం. కొద్ది రోజులు... సంవత్సరాలు... కొన్నిసార్లు జీవితకాలంలో ఆ గాయం మానకపోవచ్చు! ప్రతి ఒక్కరూ ఎవరికి వారుగా జీవించడంతో పాటు- వ్యక్తిగత అవసరాలు, అభిప్రాయాలు భిన్నంగా ఉండటం, ఒక్కొక్కరు ప్రపంచాన్ని చూసే దృక్పథం ఒక్కోలా ఉండటం సంభవిస్తుంటాయి.

ఆదిత్యహృదయ పఠనం తప్పనిసరి

ఉగాది రోజయినా పఠిస్తే ఆరోగ్యదాయకం

హైదరాబాద్,మార్చి24(ఆర్ఎన్ఎ): సూర్యోదయంతో మన ఉగాది ప్రారంభం రోజు ఆదిత్యహృదయ పఠనం మంచిదని పెద్దల ఉవాచ. ఉగాదినాడు నూతన సంవత్సర ఆరంభాన్ని చక్కని శుభ భావనతో, కాలస్వరూపుడైన భగవంతుడి ఆరాధనతో పవిత్రంగా ఆచరించడం భారతీయుల సంప్రదాయం. వివిధ వ్యాధులు దాడి చేస్తున్న క్రమంలో ఉగాది రోజు ఆదిత్యహృదయ పఠనం మంచిదని శ్రీ త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి అభిలషించారు. ఇది మనిషిలో శక్తికి కారణమవుతుందన్నారు. ఆత్మస్థయిర్యం ఉంటుందన్నారు. సమస్త ప్రాణికోటికి జీవన శక్తిని, ఆరోగ్య భాగ్యాన్ని ప్రసాదించే ప్రత్యక్ష దైవం సూర్యనారాయణుడు. ఆయనకు రవి, భాస్కరుడు, దినమణి, దివాకరుడు, ఆదిత్యుడు ఇలా అనేక పేర్లు ఉన్నాయి. అవన్నీ సూర్యుడి ప్రాభవాన్ని తెలియజేసాయి.సూర్య మహిమను 31 శ్లోకాల్లో 'ఆదిత్య హృదయం' పేరిట వాల్మీకి మనకు అందజేశారు. ఇది రామాయణం 'యుద్ధకాండ'లో ఉంది. రామరావణ యుద్ధాన్ని ఆకాశం నుంచి దేవతలు, మహర్షులు, గంధర్వులు ఉత్కంఠగా చూస్తుంటారు. వారిలో అగస్త్య మహర్షి ఉంటాడు. తపోశక్తితో పరమేశ్వరుడి అనుగ్రహం పొందిన రావణుణ్ని సంహరించడం ఎలా అని ఆలోచిస్తూ రాముడి వద్దకు వెళతాడు. వెళ్లి ఆదిత్య హృదయాన్ని ఉపదేశించడంతో, దాన్ని రాముడు పఠించి యుద్ధంలో విజయం సాధిస్తాడు. శాస్త్ర విధిని అనుసరించి ముందురోజే శుభ్రం చేసుకున్న గృహాన్ని మామిడి తోరణాలు, రంగవల్లులు, పసుపు గుమ్మాలతో అలంకరించడం సంప్రదాయం. బ్రాహ్మీ ముహూర్తంలో అభ్యంగన స్నానం చేసి గణపతిని, ఇష్టదేవతను పూజించాలి. వాణీ హిరణ్యగర్భు థ(సరస్వతి, బ్రహ్మ)లు, లక్ష్మీ నారాయణులు, ఉమా మహేశ్వరులతో పాటు దిక్పాల కులను, నవగ్రహాలను యథాశక్తి అర్చించాలి. ఇక తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలు- అనే అయిదు అంగాలను జ్యోతిషశాస్త్ర రీత్యా గణించిన గ్రంథమే 'పంచాంగం'. సంవత్సర ఆరంభంలో గ్రహ, నక్షత్ర, వారాదులు అనుసరించి కాలగమనాన్ని తెలుసుకోవడమే పంచాంగ శ్రవణం. నిత్యం అనుష్ఠానం చేసుకొనేట ప్పుడూ దేశ, కాల సంకీర్తన అనే సంప్రదాయం ఉంది. ఆ సమయంలో మనం ఉన్న ప్రాంతం; అక్కడి నది, పర్వతాల ప్రస్తావన; దేశ సంకీర్తన; ఆనాటి తిథి, వార, నక్షత్రాది స్మరణ కాల సంకీర్తన ఉంటుంది. అనునిత్యం ఈ సంప్రదాయాన్ని పాటించడం వల్ల, ఆ రోజుకు సంబంధించిన కాలభాగాలు జ్ఞప్తిలో ఉంటాయి. సంవత్సరం, పగలు, రాత్రి, పక్షం, మాసం, అయనం, యుగం, కల్పం... వీటన్నింటికీ పేర్లు, లక్షణాలు ఉన్నాయి. వీటి పరిజ్ఞానమే సంస్కృతి సంబంధ వారసత్వంగా భారతీయులందరి కర్తవ్యం. ఈ కర్తవ్య పాలనలో ఉగాది ఒక మధుర ఘట్టం. పంచాంగ శ్రవణ అనంతరం ఉగాది పచ్చడిని నివేదించి,

ప్రసాదంగా స్వీకరించడం విధి. వేపపూత, మామిడి, బెల్లం- దీని ప్రధాన ద్రవ్యాలు అని శాస్త్రం చెబుతోంది. కాలం ఎటువంటివాటిని సూచిం చినా సంకల్ప బలం, సత్కర్మ ఆచరణ, సద్భావనతో సవరించుకోగలం అనే చక్కటి విషయాన్ని వలు ధార్మిక, జ్యోతిష గ్రంథాలు చెబుతున్నాయి. అందుకే ఉత్సాహం, ఆశాభావం, దేశహిత కాంక్షతో నూతన వత్సర వికారినామని స్వాగతిద్దాం. భారతదేశంలో కాలగణనకు మూడు మానాలు అనూచానంగా వస్తున్నాయి. చాంద్రమానం, సౌరమానం, బార్హస్పత్య మానం. ఈ మూడూ వేదాధారమైన ప్రాచీన జ్యోతిషశాస్త్ర ప్రమాణాలతో ఉన్నవే. కొన్ని కొన్ని ప్రాంతాల్లో కొన్ని కాలమానాలు ప్రమాణాలు. సౌర-చాంద్ర మానాల్లో సంవత్సర నామాలు మారవు. పంచాంగాన్ని పూజించి, శాస్త్రవేత్త ద్వారా పంచాంగ శ్రవణం చేయాలి.

పెరగుతున్న కరోనా విరాళాలు

48కోట్లు అందించిన ఉద్యోగ,ఉపాధ్యా సంఘాలు

హీరో నితిన్ పదిలక్షల సాయం

2కోట్లు అందచేసిన సత్యనాదెళ్ల సతీమణి

హైదరాబాద్,మార్చి24(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ నియంత్రణకు తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. కరోనా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వానికి అండగా పలువురు తమవంతు సహాయాన్ని అందజేస్తున్నారు. తాజాగా సీఎం కేసీఆర్‌ను ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు కలిశారు. ఒకరోజు మూల వేతనాన్నిప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు విరాళంగా అందించారు. కరోనా నియంత్రణకు సీఎం సహాయనిధికి రూ.48కోట్లు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌ను కలిసి జేఏసీ నాయకులు రవీందర్‌రెడ్డి, మమత చెక్ అందించారు. అలాగే కరోనా నివారణ చర్యలకు మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యనాదెళ్ల సతీమణి భారీ విరాళం ప్రకటించారు. సీఎం సహాయనిధికి సత్యనాదెళ్ల సతీమణి అనుపమ రూ.2కోట్ల విరాళం అందించారు. ఈ సందర్భంగా అనుపమ తండ్రి, విశ్రాంత ఐఏఎస్ కేఆర్ వేణుగోపాల్ సీఎంను కలిసి చెక్ అందజేశారు. హీరో నితిన్ పది లక్షల విరాళాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి చెక్ అందించారు. కరోనా వైరస్ నియంత్రణకు తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. కరోనా నివారణ చర్యలకు, మహమ్మారిని పూర్తిస్థాయిలో తరిమికొట్టేందుకు ప్రభుత్వానికి అండగా పలువురు తమవంతు సహాయాన్ని అందజేస్తున్నారు. తాజాగా ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు కలిశారు. కరోనా నిరోధానికి ఒకరోజు మూల వేతనాన్నిప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు విరాళంగా అందించారు. కరోనా నియంత్రణకు సీఎం సహాయనిధికి రూ.48కోట్లు విరాళంగా అందజేశారు.

లాభాలను మూటగట్టుకున్న మార్కెట్లు

ఆర్థిక ప్యాకేజీ ప్రకటనతో పుంజుకున్న మార్కెట్లు

ముంబై,మార్చి24(ఆర్ఎన్ఎ): గ్లోబల్ మార్కెట్ల ఊతంతో పాటు కరోనా మహమ్మారి కట్టడికి ఆర్థిక ప్యాకేజ్ ప్రకటించవచ్చనే అంచనాలతో స్టాక్‌మార్కెట్లు మంగళవారం భారీగా లాభపడ్డాయి. ఓ దశలో 1286 పాయింట్లు ఎగిసిన బీఎస్ఈ సెన్సెక్స్ ఆర్థిక ప్యాకేజ్‌ను తర్వాత ప్రకటిస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించడంతో ఆరంభ లాభాలు కొంతమేర ఆవిరయ్యాయి. ఇక బ్లాక్ మండే విషాదాన్ని మరిపించేలా అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. దేశీయంగా విమాన సర్వీసులను రద్దు చేయడంతో విమానయాన రంగ షేర్లు నష్టపోయాయి. మొత్తంమీద బీఎస్ఈ సెన్సెక్స్ 692 పాయింట్ల లాభంతో 26,674 పాయింట్ల వద్ద ముగియగా, 190 పాయింట్లు పెరిగిన ఎన్ఎస్ఈ నిఫ్టీ 7801 పాయింట్ల వద్ద క్లోజయింది. బ్యాంకింగ్, ఐటీ, ఫార్మా షేర్లు లాభాలతో ముగిశాయి. షార్ట్ కవరింగ్ కారణంగా మార్కెట్ రీబౌండ్ అయిందని విశ్లేషకులు చెబుతున్నారు. మార్కెట్ ఈ స్థాయిలో నిలదొక్కుకోవడం ముఖ్యమని, ట్రేడర్లు అప్రమత్తంగా వుండాలని సూచిస్తున్నారు. మరోవైపు అంతర్జాతీయ చమురు ధరలు పుంజుకోవడంతో ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుంటాయని మదుపరుల్లో ఆశలు నెలకొన్నాయి.

సచివాలయాన్ని ఐసోలేషన్ కేంద్రం చేయాలి

ఆయుష్మాన్ భారత్ అమలు చేయండి

కెసిఆర్‌కు బండి సంజయ్ లేఖ

హైదరాబాద్,మార్చి24 (ఆర్ ఎన్ఎ) :ఖాళీగా ఉన్న తెలంగాణ సెక్రటేరియట్‌ని ఐసోలేషన్ కేంద్రంగా ఉపయోగించాలని బీజేపీ తెలంగాణ అధ్యక్షులు, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణలో కరోనా బాధితుల సంఖ్య అధికంగా పెరిగినట్లయితే, సెక్రటేరియట్ ఖాళీగా ఉన్నందున ఐసోలేషన్ కేంద్రంగా ఉపయోగించాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. ఈ మేరకు బండి సంజయ్ తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ట్యాగ్ చేస్తూ ట్విటర్‌లో పోస్ట్ చేశారు. ఇదిలావుంటే కోవిడ్ 19ను కేంద్రం ఆయుశ్మాన్ భారత్‌లో చేర్చిన దృష్ట్యా తెలంగాణాలో కూడా ఆయుశ్మాన్ భారత్‌ను అమలు చేయాలను సీఎం కేసీఆర్‌కు బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో కరోనా వరస్‌పై ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ లేఖ రాశారు. కరోనా విపత్తును ఎదుర్కోవడానికి ప్రభుత్వానికి తమ పూర్తి సహకారం ఉంటుందని స్పష్టీకరించారు. రాష్ట్రంలోని లక్షలాది మంది బీజేపీ కార్య కర్తలు కరోనాపై ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో పాల్గొనడానికి సిద్ధమని ప్రకటించారు.

పోలీసుల తీరుకు నిరసనగా సూర్యాపేటలో విధులు బహిష్కరించి ఆందోళనకు దిగిన నర్సులు

ఉత్తమ పూజాద్రవ్యం ధవనం

గ్రహదోషాలకు మంచిదని సూచనలు

హైదరాబాద్,మార్చి24(ఆర్ఎన్ఎ): చైత్ర శుక్ల పాడ్యమినాడు అంటే ఉగాది నాడు ధవనంతో బ్రహ్మకు పూజ చేయాలని అంటారు. యుగకర్త కనుక ఆయనకు పూజచేచయడం మంచిదంటారు. ఈ దవనం శరీర ఆరోగ్యగానికి ఉపకరించే ఓ చక్కటి ఔషధం, సుగంధాన్ని ఇవ్వటమే కాక వీటిని ధరించిన వారికి విషదోషాలూ నశిస్తాయి. అలాగే ఉగాదినాడు సర్వ విఘ్నాలు నశించేందుకు వినాయకుడిని, గ్రహదోషాలు పోయేందుకు నవగ్రహాల్ని, పుణ్యప్రాప్తికి ఇష్టదేవత ఆరాధనను చెయ్యాలి.చాంద్రమానాన్ని పరిగణించే వారంతా చైత్రశుక్ల పాడ్యమినాడు ఉగాది పండుగను చేసుకొంటారు. పూర్వకాలం నుంచి ఉగాదిని వేడుకగా జరుపుకోవడం ఆచారంగా వస్తోంది. ఈ విషయాల్ని నాటి నుంచి నేటి దాకా ప్రత గ్రంథాలు మాత్రం వివరించి చెబుతూనే ఉన్నాయి. ఉగాదినాడు ప్రతిగృహం కళకళలాడేలా ధ్వజారోహణం చేయాల్సి ఉంటుంది. తిలాభ్యంగనం, నూతన వస్త్రధారణ, గొడుగులు, విసనకర్రల లాంటివి సమకూర్చుకోవటం, వాటిని ఇతరులకు ఇవ్వటం, దమన పత్రాలతో బ్రహ్మదేవుడికి పూజ చేయటం, సర్వ ఆపదలూ శాంతించేందుకు తగిన వ్రతాలు చేయటం, పౌరుష వ్రతివత్ వ్రతం, నింబకుసుమ భక్షణం, చలివేంద్రాలు ప్రారంభించటం, రాజ(అధికారి) దర్శనం చేయటం, వసంత నవరాత్రుల్ని ప్రారంభించటమనే కార్యాల్ని ఉగాదినాడు నిర్వహించాలి. ఇవన్నీ వ్యక్తి ఆరోగ్యానికి, సామాజిక సంక్షేమానికి, శాంతికి ఉపకరించేనని వీటన్నింటినీ విశ్లేషించి చూస్తే తెలుస్తుంది. ఉగాదినాడు తొలికార్యంగా చేసే ఇంద్ర ధ్వజారోహణం పూర్వం సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలన్న ఆకాంక్షతో జరుపుతూ ఉండేవారు. ఇలా చేయటం ఇంద్ర ప్రీతికరం. ఆ తర్వాత విధిగా నువ్వుల నూనెతో తలంటి స్నానం చేయాలి. ఈ తరహా స్నానం మంగళ ప్రదమేకాక ఆరోగ్యకరం. ఇలా చేయకపోతే నరకప్రాప్తి అని పెద్దలు హెచ్చరిస్తున్నారు. తరతరాలుగా ఉగాదిని జరుపుకోవటానికి సంబంధించి కొన్ని ప్రత్యేక విషయాలున్నాయి. వసంత రుతువు సంవత్సరంలో తొలి రుతువు ప్రకృతంతా ఒక కొత్త జీవకళతో అలరారుతుంటుంది. ఈ రుతువులో కొత్తకొత్తగా లభించే వేపపువ్వు, చింతపండు, బెల్లం లాంటివి కలిపి పచ్చడిగా చేసి సేవించటం వెనుక ఆచారంతోపాటు ఆరోగ్య పరిరక్షణ సంబంధమైన ఆలోచనా ఉంది. కొత్త పంచాంగానికి పూజ చేసి ఎవరికి వారు తమ తమ సంవత్సర రాశి ఫలాల్ని తెలుసుకోవాలంటారు. దీనివల్ల సంవత్సరంలో ఎదురయ్యే గ్రహదోషాల వంటివి ఉంటే వాటిని ముందే తెలుసుకొని శాంతుల వంటివి జరుపుకొనే వీలుంటుంది. అన్నింటినీ మించి ఉగాది నాడు పెద్దల ఆశీర్వచనాలు తీసుకోవడం. వారిని సంవత్సరంరాది నాడు దర్శించటం,ఆశీర్వచనం తీసుకోవడం మంచిదని పండితులు సూచిస్తున్నారు. ఉగాది నాడు ఉషోదయ కాలంలోనే మేల్కొని, శుచి అయి, నూతన వస్త్రాలను ధరించి, దైవ ఆరాధన చేసి ఆ తర్వాత పెద్దల ఆశీస్సులందుకోవటం ఓ అలవాటు. ఇలాంటి చక్కటి అలవాట్లు సంవత్సరమంతా పాటించేందుకు ఆ రోజు స్ఫూర్తినిస్తుంది. పెద్దలను గౌరవించటంతో పాటు తోటివారితో తమ ఆనందాన్ని పంచుకునేందుకు ఈ పండగ ఉపకరిస్తుంది. ఎవరికి వారు ఉన్నంతలో నూతన వస్త్రాల్ని, ఆభరణాల్ని ధరించి సంతోషకరంగా ఉండాలి. ఇలా చేసి తీరాలి అనటంలో ఎవరికి వారు అంతా సంతోషంగా ఉండటమే సమాజ శాంతి హేతువన్న ఆలోచన కనిపిస్తుంది. ఉత్సవాల పేరుతో అందరూ కలిసి మెలసి ఉండటం, కలిసికట్టుగా కొన్ని కార్యాల్ని చేయటం లాంటివన్నీ వసంత నవరాత్రి ఉత్సవాల సమయాల్లో జరగటానికి వీలుంటుందనే సదాలోచనతోనే పెద్దలు వీటన్నింటినీ ఏర్పరచి ఈ పద్ధతుల ప్రకారం ఉగాది పండుగను జరుపుకోండి... అని చెప్పినట్టు కనిపిస్తోంది. ఈ పండుగ న